www.toliadugudaily.com
www.epaper.toliadugudaily.com

# తొలిఅడుగు
తెలుగు దిన పత్రిక

హైదరాబాద్ | సంపుటి : 02 | సంచిక : 25 | శనివారం 24 - 05 - 2025 | ఎడిటర్ : పి. జయరాం | పేజీలు : 8 | వెల : 4

## నాలాలా విస్తరణ పనుల్లో జాప్యం లేకుండా కృషి చేయాలి




3

## విద్యార్థులు కోటాలోనే ఎందుకు చనిపోతున్నారు..?

– రాజస్థాన్ ప్రభుత్వాన్ని నిలదీసిన సుప్రీంకోర్టు



తొలిఅడుగు, ఉన్నత చదువు, ఉద్యోగాల కోచింగ్‌కు ప్రసిద్ధిగాంచిన రాజస్థాన్ కోటాలో విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్న విషయం తెలిసిందే. ఒత్తిడి కారణంగా గత కొంతకాలంగా విద్యార్థులు తనువు చాలిస్తున్నారు. వసతి గృహాల్లోని ఫ్యాన్లకు ఉరివేసుకోవడం,

2

## తల్లి మరణం.. పదవీ విరమణ రోజు..

– అయినా 11 తీర్పులిచ్చిన సుప్రీం జడ్జి ఓకా



తొలిఅడుగు, జస్టిస్ ఓకా. అవును సుప్రీంకోర్టు న్యాయమూర్తి ఎఎస్ ఓకా చరిత్రనే మార్చారు. తన పదవీ విరమణ రోజు సాంప్రదాయాల్ని పక్కనపెట్టి పనే పరమావధి అని చేసి చూపించారు. ఎంతో ప్రేమ ఉన్న తన తల్లిని కోల్పోయి

2

## ఆర్గానిక్ ఉత్పత్తులకు కొత్త ప్రపంచం..



తొలిఅడుగు, న్యూఢిల్లీ,: దేశంలోని ఈశాన్య రాష్ట్రాలకు ఓ వైవిధ్యం ఉందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఆ వైవిధ్యమే

2

## బెయిల్ వచ్చిందని ర్యాలీ చేశారు..

– రేప్ కేసు నిందితులపై ప్రజల ఆగ్రహం..



తొలిఅడుగు, రేప్ కేసులో జైలు శిక్ష అనుభవిస్తున్న యువకులకు కోర్టు ఇటీవల బెయిల్ మంజూరు చేసింది. అయితే విడుదల అవగానే వారంతా బైకులు, కార్ల తో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. బెయిల్ వచ్చిందని ర్యాలీ చేశారు.. రేప్ కేసు నిందితులపై ప్రజల ఆగ్రహం.. రేప్ కేసులో జైలు శిక్ష అనుభవిస్తున్న యువకులకు కోర్టు ఇటీవల బెయిల్ మంజూరు చేసింది. అయితే

2

# రాష్ట్ర అభివృద్ధి కోసం మోదీని ఎన్నిసార్లైనా కలుస్తా



☐ ఎన్నికలప్పుడే రాజకీయాలు అని.. తర్వాత అందరినీ కలుపుకుని ముందు కెళ్తా.. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి

☐ ఐదేళ్లలోపు కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా మారుస్తా..

తొలిఅడుగు, హైదరాబాద్ : జహీరాబాద్‌లో శుక్రవారం నిర్వహించిన బహిరంగ సభలో రేవంత్ రెడ్డి మాట్లాడారు. 'నిమ్జ్ భూ నిర్వాసితులైన 5612 కుటుంబాలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని ఈ వేదికగా ప్రకటిస్తున్నా. ఆ కుటుంబాలకు భోజనాలు పెట్టి ఇండ్ల పట్టాలు ఇచ్చే బాధ్యత జగ్గారెడ్డికి అప్పగిస్తున్నాం. ఆ కుటుంబాలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసేందుకు అవసరమైన కార్యాచరణ చేపట్టాలని అధికారులను ఆదేశిస్తున్నా' అని రేవంత్ రెడ్డి ప్రకటించారు. జహీరాబాద్ నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఎన్నికల సమయంలోనే రాజకీయాలు.. అభివృద్ధిలో అందరినీ కలుపుకుని ముందుకు వెళతామని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. నారాయణఖేడ్ నియోజకవర్గానికి సురేశ్ షెట్కర్, సంజీవరెడ్డి రెండు కళ్లలాంటివారు.నారాయణఖేడ్ అభివృద్ధికి అవసరమైన నిధులు

రైతులకు రుణమాఫీ.. మహిళలకు ఉచిత బస్సు ఇచ్చామని.. రాష్ట్రాన్ని అభివృద్ధి చేసి ప్రజలకు అంకితం చేస్తానని రేవంత్ రెడ్డి తెలిపారు. అభివృద్ధి కోసం ప్రధాని మోదీని ఎన్ని సార్లయినా కలుస్తానని సంచలన ప్రకటన చేశారు.

2లో..

## తెలంగాణలో 3 కొత్త కేంద్ర సంస్థలు



తొలిఅడుగు, హైదరాబాద్ : తెలంగాణలో కేంద్ర ప్రభుత్వం మూడు కొత్త సంస్థలను ఏర్పాటు చేయబోతోందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఇక్కడ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆయన.. 2014 నుంచి రాష్ట్రానికి కొత్తగా పలు కేంద్ర సంస్థలు వచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. కొత్తగా ఏర్పాటు చేయబోతున్న మూడు కేంద్ర సంస్థల గురించి వెల్లడించారు. మిల్లెట్స్ ప్రాధాన్యాన్ని పెంచే క్రమంలో భాగంగా మోదీ సర్కారు తెలంగాణలో అంతర్జాతీయ స్థాయి మిల్లెట్స్ పరిశోధన కేంద్రాన్ని

2లో..

## నక్సల్స్ మృతదేహాలను కుటుంబీకులకు అప్పగించాలి




తొలిఅడుగు, హైదరాబాద్ : నారాయణపూర్ ఎన్‌కౌంటర్‌లో అమరులైన మావోయిస్టుల మృతదేహాలను కుటుంబసభ్యులకు అప్పగించాలని పలు ప్రజా సంఘాల నేతలు డిమాండ్ చేశారు. శుక్రవారం హైదరాబాద్ లో మీడియాతో అమరుల బంధుమిత్రుల సంఘం నేత భవాని, పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, ఐఎఫ్‌టీయూ నేత అనురాధ, దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమప్రతినిధి రాజు, అరుణోదయ సాంస్కృతిక ప్రతినిధి పోతుల సురేశ్‌తో పాటు తెలంగాణ ప్రజా ఫ్రంట్, ఐఏపీఎల్ తదితర సంఘాల నేతలు మాట్లాడారు. ఆపరేషన్ కగార్‌ను తక్షణమే నిలిపేయాలన్నారు. బూటకపు ఎన్‌కౌంటర్లపై న్యాయవిచారణ జరిపించాలని, చనిపోయిన మావోయిస్టుల మృతదేహాలకు బంధువుల సమక్షంలో శవ పంచనామా చేయాలని డిమాండ్ చేశారు. కాగా, మానవతా దృక్పథంతో ఆపరేషన్ కగార్‌ను

2లో..

## తెలంగాణలో దంచికొడుతున్న వానలు..



తొలిఅడుగు, తెలంగాణవ్యాప్తంగా వర్షాలు దంచికొడుతున్నాయి. ద్రోణి ప్రభావంతో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. రాగల రెండురోజుల్లో నైరుతి రుతుపవనాలు కేరళను తాకనున్నాయి. ప్రస్తుతం పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని.. దాంతో పాటు కర్నాటక, తమిళనాడుతో పాటు దక్షిణ మధ్య ప్రాంతాల్లో నైరుతి రుతుపవనాల విస్తరణకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని వాతావరణశాఖ తెలిపింది. ఈ నెల 27న పశ్చిమ మధ్య, ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని వాతావరణశాఖ తెలిపింది. ఈ క్రమంలో తెలంగాణలో రాగల ఐదురోజులు భారీ వర్షాలు కొనసాగే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. శుక్రవారం ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం

2

# విద్యార్థులు కోటాలోనే ఎందుకు చనిపోతున్నారు..?

మొదటిపేజీ తరువాయి విషం తాగడం వంటి చర్యలకు పాల్పడుతున్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థుల ఆత్మహత్యలను దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు తీవ్రంగా పరిగణించింది. ఇది చాలా ఆందోళకరమైన విషయం అంటూ రాజస్థాన్ ప్రభుత్వంపై ఫైర్ అయ్యింది. విద్యార్థుల ఆత్మహత్యలు కోటాలో మాత్రమే ఎందుకు జరుగుతున్నాయని ప్రశ్నించింది. ఈ సంక్షోభాన్ని పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుందని నిలదీశింది. వీటిని తేలికగా తీసుకోవద్దన్న ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఈ ఏడాది కోటాలో ఇప్పటి వరకూ 14 మంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్న విషయం తెలిసిందే. విద్యార్థుల ఆత్మహత్యలపై నమోదైన పిటిషన్లపై న్యాయమూర్తులు జేబీ పార్దివాలా, ఆర్ మహాదేవన్‌లతో కూడిన ధర్మాసనం ఇవాళ విచారణ చేపట్టింది. విద్యార్థుల మరణాలు చాలా తీవ్రమైన సమస్యగా అభివర్ణించింది. వీటిని తేలిగ్గా తీసుకోకూడదని పేర్కొంది. 'మీరు ఏం చేస్తున్నారు..? ఇంత మంది పిల్లలు కోటాలో మాత్రమే ఎందుకు ఆత్మహత్య చేసుకుంటున్నారు..? దీని గురించి మీరు ఆలోచించలేదా..?' అంటూ రాష్ట్ర ప్రభుత్వం తరఫున ప్రాతినిధ్యం వహిస్తున్న న్యాయవాదిని జస్టిస్ పార్దివాలా ప్రశ్నించారు. 'కోటాలో ఇప్పటి వరకూ ఎంత మంది యువ విద్యార్థులు మరణించారు..? విద్యార్థులు ఎందుకు చనిపోతున్నారు..?' అంటూ కోర్టు ప్రశ్నించింది.

# తల్లి మరణం.. పదవీ విరమణ రోజు..

మొదటిపేజీ తరువాయి ఒక్క రోజు కూడా గడవగముందే కోర్టుకు హాజరయ్యారు. అంతేకాదు, ఏకంగా చివరి రోజున 11 తీర్పులు ఇచ్చారు. "పదవీ విరమణ" అనే పదాన్ని తాను ద్వేషిస్తానని, చివరి రోజున పని చేయకపోవడం అనే సంప్రదాయంతో తాను ఏకీభవించనని ఓకా చెప్పారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఓకా శనివారం (మే 24న) పదవీ విరమణ చేయబోతున్నారని బార్ అండ్ బెంచ్ ప్రకటించింది. దీనికి ముందు రోజు ముందు ఓకా తన తల్లి చనిపోవడంతో అంత్యక్రియలకు హాజరు కావడానికి ముంబైకి బయలుదేరి వెళ్లారు. ఒక్క రోజులోనే ఢిల్లీకి తిరిగివచ్చి కోర్టుకు హాజరయ్యారు. పదవీ విరమణ రోజున పని చేయకూడదనే సంప్రదాయాన్ని పక్కనపెట్టి జస్టిస్ ఓకా తన సాధారణ బెంచ్‌లో భాగంగా 11 తీర్పులు వెలువరించారు. తర్వాత చీఫ్ జస్టిస్ బిఆర్ గవైతో కలిసి ఉత్సవ బెంచ్‌కి వెళ్లారు. కాగా, ఈ వారం ప్రారంభంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి అయిన ఓకాకు సుప్రీంకోర్టు అడ్వకేట్స్ ఆన్ రికార్డ్ అసోసియేషన్ అభినందన సభ ఏర్పాటు చేసింది. ఆ సభలో జస్టిస్ ఓకా మాట్లాడుతూ చివరి రోజున పని చేయకూడదనే సంప్రదాయంతో తాను ఏకీభవించనని సభా ముఖంగా ప్రకటించారు. "పదవీ విరమణ చేసే న్యాయమూర్తి చివరి రోజున పని చేయకూడదనే సుప్రీంకోర్టులో అనుసరించే ఒక సంప్రదాయాన్ని నేను ఆమోదించను. ఆ సంప్రదాయాన్ని వదిలించుకోవడానికి మనకు కొంత సమయం పడుతుంది, కానీ కనీసం చివరి రోజున నేను రెగ్యులర్ బెంచ్‌లో కూర్చుని కొన్ని తీర్పులు ప్రకటించడంలో నాకు సంతృప్తి ఉంది" అని ఆయన చెప్పారు. "పదవీ విరమణ" అనే పదాన్ని తాను ద్వేషిస్తున్నానని, జనవరి 2025 నుండి వీలైనన్ని ఎక్కువ కేసులు వినాలని నిర్ణయించుకున్నానని, అలాగే పనిచేశానని ఆయన అన్నారు.

# బెయిల్ వచ్చిందని ర్యాలీ చేశారు..

మొదటిపేజీ తరువాయి బైకులు, కార్లతో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈలలు, కేకలు వేస్తూ గోల గోల చేశారు. వీరి నిర్వాకంపై ప్రజలంతా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే..కర్నాటక హావేరి జిల్లా అక్కి ఆలూర్ పట్టణంలో ఈ ఘటన చోటు చేసుకుంది. రేప్ కేసులో జైలు శిక్ష అనుభవిస్తున్న ఖైదీలకు కోర్టు ఇటీవల బెయిల్ మంజూరు చేసింది. దీంతో రేప్ కేసులో ప్రధాన నిందితులుగా ఉన్న అఫ్తాబ్ చందనకట్టి, మదర్ సాబ్ మందక్కి, సమివుల్లా లలనావర్, మొహమ్మద్ సాదిక్ అగసిమణి, షోయిబ్ ముల్లా, తౌసిప్ చోటి, రియాజ్ సావికేరి జైలు నుంచి విడుదలయ్యారు. అయితే జైలు నుంచి బయటికి వచ్చిన వారు.. బైకులు, కార్లతో పట్టణంలో ర్యాలీ చేశారు. తామేదో గొప్ప పని చేసి బయటికి వచ్చినట్లుగా విజయం సంకేతాలు చూపుతూ, ఈలలు.. కేకలు వేస్తూ వెళ్లడాన్ని చూసి ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు.

అసలేం జరిగిందంటే..

కర్నాటక హావేరి జిల్లాలో 2014 జనవరి 8న మహిళపై గ్యాంప్ రేప్ జరిగింది. మైనారిటీ వర్గానికి చెందిన 26 ఏళ్ల మహిళ.. మరో మతానికి చెందిన 40 ఏళ్ల ఆర్టీసీ డ్రైవర్‌తో కలిసి హోటల్ గదిలో ఉంది. ఈ క్రమంలో పైపు రిపేరు పేరుతో గదిలోకి వచ్చిన ఏడుగురు దుండగులు ఆమెను బలవంతంగా కారులో వేరే ప్రాంతానికి తీసుకెళ్లి అత్యాచారం చేశారు. వేరే మతానికి చెందిన వ్యక్తితో ఉన్నాననే కోపంతోనే ఇలా చేశారని అప్పట్లో బాధితురాలు తన ఫిర్యాదులో పేర్కొంది. ఈ కేసుకు సంబంధించి మొత్తం 19 మందిని అరెస్ట్ చేశారు. కాగా, వీరిలో 7 మంది ప్రధాన నిందితులుగా తేల్చారు. వీరిలో 12 మందిని సుమారు 10 నెలల క్రితం బెయిల్‌పై విడుదల చేయగా.. మిగిలిన ఏడుగురు నిందితులకు ఇటీవల కోర్టు బెయిల్ మంజూరు చేసింది. కాగా, విడుదలైన యువకుల ర్యాలీకి సంబంధించిన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి.

# రాష్ట్ర అభివృద్ధి కోసం మోదీని ఎన్నిసార్లైనా కలుస్తా

మొదటిపేజీ తరువాయి మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఉమ్మడి మెదక్ జిల్లా అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లే విధంగా ప్రభుత్వం ముందుకు వెళుతుందని చెప్పారు.రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రజా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. రైతు రుణమాఫీ చేసి రైతులను రుణవిముక్తులను చేశాం. రైతు భరోసాను రూ.12 వేలకు పెంచాం. భూమిలేని పేదలకూ భరోసా అందిస్తున్నాం. పేదలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నాం. రూ.500కే వంట గ్యాస్ సిలిండర్ అందిస్తున్నాం. మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాం. స్వయం సహాయక సంఘాల మహిళలకు బస్సులను అందించి వారిని ప్రోత్సహిస్తున్నాం. ఆడబిడ్డలను ఆర్థికంగా నిలబెట్టాలనే కార్యాచరణతో ముందుకెళ్తున్నాం' అని రేవంత్ రెడ్డి వివరించారు.ఆడబిడ్డలకు మాట ఇస్తున్నా. ఐదేళ్లలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తాం. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలను భర్తీ చేశాం. రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ సహాయం తీసుకుంటాం. రాష్ట్రానికి రావాల్సిన నిధుల కోసం ప్రధాని మోదీని ఎన్నిసార్లయినా కలుస్తాం' అని రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఎన్నికల సమయంలోనే రాజకీయాలు.. అభివృద్ధి కోసం అందరినీ కలుపుకుని ముందుకెళ్తామని తెలిపారు.ప్రతిపక్ష నాయకుడికి నేను విజ్ఞప్తి చేస్తున్నా. శాసనసభకు రండి ప్రజా సమస్యలపై చర్చించండి. మేం ఏదైనా తప్పులు చేస్తే



సూచనలు ఇవ్వండి సరిదిద్దుకుంటాం. అధికారంలో ఉంటేనే అసెంబ్లీకి వస్తామని మీరు అనుకుంటే.. ప్రజలు గుణపాఠం చెబుతారు' అని రేవంత్ రెడ్డి తెలిపారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేసి ప్రజలకు అంకితం ఇచ్చే వరకు తాను నిద్రపోయేది లేదని పేర్కొన్నారు.

# ఆర్గానిక్ ఉత్పత్తులకు కొత్త ప్రపంచం..

మొదటిపేజీ తరువాయి ఈశాన్య రాష్ట్రాలకు బలమని ఆయన స్పష్టం చేశారు. భారతదేశమే ఒక వైవిధ్యభరితమైన దేశమని, అలాంటి దేశంలో ఈశాన్య రాష్ట్రాల ప్రాంతం అత్యంత వైవిధ్యభరితమైన భాగమని అభివర్ణించారు. శుక్రవారం న్యూఢిల్లీలో రైజింగ్ నార్త్ ఈస్ట్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌ను ప్రధాని మోదీ ప్రారంభించారు. అనంతరం ప్రధాని మోదీ మాట్లాడుతూ.. ఈశాన్య రాష్ట్రాల వైవిధ్యానికి వాణిజ్యం నుంచి సంప్రదాయం వరకు, వస్త్ర రంగం నుంచి పర్యాటకం వరకూ బలాన్ని ఇస్తుందన్నారు. టీ, వెదురు ఉత్పత్తులు, సహజ వాయువు, క్రీడలు, నైపుణ్యానికి ఈశాన్య రాష్ట్రాలు పర్యాయ పదమని చెప్పుకొచ్చారు. ఇక ఆర్గానిక్ ఉత్పత్తులకు సైతం ఈ రాష్ట్రాలు కొత్త ప్రపంచమని కీర్తించారు. అలాగే దేశానికి ఈశాన్య ప్రాంతం శక్తి కేంద్రమన్నారు. కానీ తమకు మాత్రం ఈ రాష్ట్రాలు అష్టలక్ష్ములతో సమానమని ఆయన అభివర్ణించారు. ఈస్ట్ అంటే దిశ మాత్రమే కాదని.. %జూూూ%.. అంటే ఎంపావర్ (సాధికారత), యాక్ట్ (చర్య), స్ట్రేంథెన్ (బలోపేతం), పరివర్తన ( ట్రాన్స్‌ఫారమ్) అంటూ ప్రధాని మోదీ వివరించారు. గతంలో ఈశాన్య రాష్ట్రమంటే.. సరిహద్దు ప్రాంతంగా మాత్రమే అంతా భావించేవారని గుర్తు చేశారు. కానీ ఆయా రాష్ట్రాలు నేడు అభివృద్ధిలో ముందు వరుసలో ఉన్నాయన్నారు. మెరుగైన మౌలిక సదుపాయాలు.. పర్యాటక రంగాన్ని ఆకర్షణీయంగా చేస్తాయన్నారు. అంతేకాకుండా అవి పెట్టుబడిదారులకు మరింత విశ్వాసాన్ని అందిస్తాయని చెప్పారు. ఈశాన్యంలో తాము మౌలిక సదుపాయాల విప్లవాన్ని ప్రారంభించామని.. అది ప్రస్తుతం అవకాశాల భూమిగా మారుతోందని చెప్పారు. ఈశాన్యంలో అనుసంధానత మరింత బలపడుతోందని ఈ సందర్భంగా ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. దేశంలోని సెమీకండక్టర్ పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేయడంలో ఈశాన్య ప్రాంతం పాత్ర బలపడుతోందన్నారు. దేశాభివృద్ధిలో ఈశాన్య రాష్ట్రాల ప్రాముఖ్యతను ప్రధాని మోదీ ఈ సందర్భంగా సోదాహరణగా వివరించారు. ఈశాన్య ప్రాంతంలోని ప్రతి రాష్ట్రం పెట్టుబడులకే కాదు.. నాయకత్వానికీ సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేస్తుందన్నారు. వికసిత్ భారత్‌లో భాగంగా తూర్పు భారతదేశం ప్రాముఖ్యతను ప్రధాని మోదీ వివరించారు.

# నక్సల్స్ మృతదేహాలను కుటుంబీకులకు అప్పగించాలి

మొదటిపేజీ తరువాయి తక్షణమే నిలిపేయాలని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను దివంగత గద్దర్ సతీమణి విమల, కూతురు వెన్నెల కోరారు. ఈమేరకు రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసి వినతి పత్రం ఇచ్చారు. ఈ విషయాన్ని రాష్ట్రపతి, ప్రధాని, కేంద్ర హోంమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని గవర్నర్‌ను కోరినట్లు తెలిపారు. కాగా, ఆపరేషన్ కగార్ విషయంలో మానవ హక్కులవేదిక (హెచ్‌ఆర్‌ఎఫ)మౌనం వహించడం క్షమించరానిదని ఆ సంస్థ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు పి.సుబ్బారావు అన్నారు. మాట్లాడాల్సిన సమయంలో హెచ్‌ఆర్‌ఎఫ మౌనం వహించినందుకు నిరసనగా ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. మరోవైపు, ఎన్‌కౌంటర్‌లో చనిపోయిన నంబాల కేశవరావు, సజ్జా వెంకట నాగేశ్వరరావు మృత దేహాలను తనకు అప్పగించేలా అధికారులను ఆదేశించాలని కోరుతూ వారి కుటుంబ సభ్యులు శుక్రవారం హైకోర్టులో హౌజ్‌మోషన్ పిటిషన్లు దాఖలు చేశారు.



# తెలంగాణలో దంచికొడుతున్న వానలు..

మొదటిపేజీ తరువాయి కురిసే అవకాశం ఉందని తెలిపింది. అలాగే, ఆసిఫాబాద్, మంచిర్యాల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, గంటకు 40-50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని చెప్పింది. నల్గొండ, సూర్యాపేట, మహూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, నాగర్ కర్నూల్, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. శనివారం నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పింది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో అక్కడక్కడ ఈదురుగాలులతో కూడిన వానలు కొనసాగుతాయని చెప్పింది. ఆదివారం నుంచి మంగళవారం వరకు రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. గంటకు 40-50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తూ ఉరుములు, మెరుపులతో కూడిన వానలు పడుతాయని హెచ్చరించింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు వాతావరణశాఖ ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. ఇదిలా ఉండగా.. గడిచిన 24గంటల్లో ఉత్తర తెలంగాణతో పాటు పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురిశాయి. అత్యధికంగా ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ 127.5 మిల్లీమీటర్లు, నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో 124.3 మిల్లీమీటర్ల వర్షాపాతం రికార్డయ్యింది.

# తెలంగాణలో 3 కొత్త కేంద్ర సంస్థలు

మొదటిపేజీ తరువాయి మంజూరు చేసిందని తెలిపారు. రూ.250 కోట్లతో 'గ్లోబల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఆన్ మిల్లెట్స్'ను కేంద్ర వ్యవసాయ శాఖ హైదరాబాద్‌లో ఏర్పాటు చేయనుందని ఆయన పేర్కొన్నారు. అలాగే.. సికింద్రాబాద్ నియోజకవర్గంలో 'కవచ్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'ను ప్రారంభం కానుందని.. జాతీయ నైపుణ్య శిక్షణ కేంద్రాన్ని (నేషనల్ స్కిల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌ను) కూడా కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేయనుందని కిషన్‌రెడ్డి వివరించారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక రియల్ ఎస్టేట్ వ్యాపారుల దగ్గర నుంచి, పరిశ్రమల నుంచి 'ట్రిపుల్ ఆర్ ట్యాక్స్' పేరిట భారీ వసూళ్లు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు.



తొలిఅడుగు
తెలుగు దిన పత్రిక

# గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ చందానగర్ సర్కిల్ కార్యాలయ ముట్టడించిన - యం సి పి ఐ (యు)

- నాయనమ్మ కుంట వాకింగ్ ట్రాక్ ఎత్తు తగ్గించాలి
- ఓంకార్ నగర్ వాసులను వరద ముంపు నుండి రక్షించాలి
- యం సి పి ఐ (యు ) ఆధ్వర్యంలో జిహెచ్ఎంసి కార్యాలయం ముందు ధర్నా






తొలిఅడుగు/ చందానగర్: చందానగర్ సర్కిల్ కార్యాలయం ముందు ఓంకార్ నగర్ వాసుల సమస్యలను పరిష్కరించాలని యం సి పీ ఐ (యు ) మియాపూర్ డివిజన్ కార్యవర్గ సభ్యులు జి లలితా అధ్యక్షతన దర్నా నిర్వహించడం జరిగింది. ఈ ధర్నా కార్యక్రమానికి యం సి పీ ఐ( యు) గ్రేటర్ హైదరాబాద్ సహయ కార్యదర్శి తుడుం అనిల్ కుమార్ మాట్లాడుతూ ... మియాపూర్ డివిజన్ పరిధిలోని ఓంకార్ నగర్ లో వెనుకబడిన వర్గాలు నిరుపేదలు గత 25 సంవత్సరాల నుండి ఇండ్లు నిర్మించుకొని ఆ సౌకర్యాలతో ఎలాంటి మౌలిక సదుపాయ లేకుండా గుంటలు తవ్వుకొని నీరు తాగి అనారోగ్య బారిన పడుతున్నారు. అయినా కనీసం మౌలిక సదుపాయాలు కల్పించలేని ప్రభుత్వాలు హైటెక్ సిటీకి ఆమడ దూరంలో ఉన్న ఈ పేద ప్రజలకు పట్టించు కొనే నాధుడు లేకుండా పోయారు. స్థానిక కార్పొరేటర్ పేద ప్రజల ఓట్లు అవసరమే తప్ప వాళ్ళ అభివృద్ధికి ఎలాంటి చర్య తీసుకోకుండా బడుగు బలహీన వర్గాల సమస్యలను పరిష్కరించడంలో విఫలమయ్యారు. నాయనమ్మ కుంట చెరువు అభివృద్ధి పేరుతో వాకింగ్ ట్రాక్ నిర్మిస్తామని చెబుతూ చెరువు కట్టను తమ ఇష్టానుసారంగా మలుపుతూ పక్కనే ఉన్న ఆక్రమణదారులకు వంత పాడుతూ వారికి అనుకూలంగా చెరువు కట్టను మలుపులు తిప్పడంతో పేద ప్రకజలకు శాపంగా మారిందన్నారు. భారీ గా మట్టి ఎత్తు పోయడం వలన పక్కనే ఉన్న ఓంకార్ నగర్ వర్షం వచ్చినా మునిగిపోయి ఇండ్లలోకి వస్తున్నాయని తెలిపారు.. ముందు జాగ్రత్త చర్యలు తీసుకోకుండా ఓంకార్ నగర్ డ్రైనేజ్ సమస్యను పరిష్కరించకుండా చెరువు కట్ట ఎత్తు పెంచడం వలన ఇవన్నీ సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. ఈ సమస్య పలుసార్లు కార్పొరేటర్ అధికారుల దగ్గరికి తీసుకెళ్లిన పట్టించుకోలేదని యంసిపీఐ (యూ) మియాపూర్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో జోనల్ కమిషనర్ కార్యాలయం ఎదురుగా చందానగర్ సర్కిల్ 21 కార్యాలయం ఎదురుగా బస్తీ వాసులతో కలిసి ధర్నా నిర్వహించడం జరిగింది. సమస్య పరిష్కరించకపోతే భవిష్యత్తులో ప్రజా ఆందోళన ద్వారానే అధికారులు, రాజకీయ నాయకుల మెడలు వంచి పనులు చేపిస్తామని అన్నారు. చందానగర్ సర్కిల్ 21 డిప్యూటీ కమిషనర్ ని కలిసి సమస్య వివరించగా వారు సానుకూలంగా స్పందించి సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ ధర్నా కార్యక్రమంలోయం సి పి ఐ( యు)మియాపూర్ డివిజన్ కార్యదర్శి ఇస్లావత్ దశరథ్ నాయక్, మియాపూర్ డివిజన్ సహాయ కార్యదర్శి పల్లె మురళి, పార్టీ గ్రేటర్ నాయకులు అంగడి పుష్ప, దీ విమల, డివిజన్ నాయకులు శివాని, జంగయ్య, ఇషాక్, బస్తీ వాసులు పాల్గొన్నారు.

# నాలాలా విస్తరణ పనుల్లో జాప్యం లేకుండా కృషి చేయాలి

- అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పని చేయాలి
- శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ హేమంత్
- అధికారులు, సిబ్బందికి పలు సూచనలు




తొలిఅడుగు / శేరిలింగంపల్లి : శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయంలో జరిగిన కార్పొరేటర్ల సమీక్షా సమావేశంలో జోనల్ కమిషనర్ హేమంత్ బోర?డే కార్పొరేటర్లు మంజుల రెడ్డి, చందానగర్, వి సింధు ఆదర్శ రెడ్డి, భారతి నగర్ డివిజన్, మెట్టు కుమార్ యాదవ్, పటాన్చెరువు డివిజన్, వి గంగాధర్ రెడ్డి, గచ్చిబౌలి డివిజన్, బి రాజ్ కుమార్, యూసఫ్ కూడా డివిజన్, దేదీప్య, వెంగళరావు నగర్ జగదీశ్వర్ గౌడ్,, మాదాపూర్ డివిజన్, పుష్ప నగేష్ యాదవ్ రామచంద్రపురం డివిజన్ జీహెచ్ఎంసీ, అలాగే అన్ని సర్కిల్ల ఉప కమిషనర్లు, సూపర్ టెండింగ్ ఇంజనీర్, గేమ్స్ ఇన్స్పెక్టర్ మొదలైన అధికారులతో కలిసి శేరిలింగంపల్లి నియోజకవర్గంలో నెలకొన్న పలు సమస్యలు చేపట్టవలసిన పలు అభివృద్ధి పనుల పై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ హేమంత్ బోర?డే మాట్లాడుతూ ... అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, సమిష్టి కృషి తో శేరిలింగంపల్లి నియోజకవర్గం ను అన్ని రంగాలలో అభివృద్ధి కి ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో నెలకొన్న పలు సమస్యలు చేపట్టవలసిన పలు అభివృద్ధి పనుల పై చర్చించడం జరిగింది. పెండింగ్ లో ఉన్న పనులు త్వరితగతిన పూర్తయ్యేలా అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. అసంపూర్తిగా మిగిలిపోయిన పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చూడలని సూచించారు. నాలల విస్తరణ పనులను వేగవంతం చేయాలని , పనులలో జాప్యం లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలని, వర్షాకాలం లోపు పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని, నాలాల విస్తరణ పనులు వేగవంతం చేయాలని తెలియచేశారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని రకాల మౌలిక వసతులు ఏర్పాటు కు కృషి చేయాలని జోనల్ కమిషనర్ హేమంత్ బోర?డే తెలియచేసారు.

# క్షయ వ్యాధి నిర్మూలన కోసం కిట్ అందజేత




తొలిఅడుగు / కొండాపూర్ : క్షయ వ్యాధి నిర్మూలనలో భాగంగా క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం అందించడం కోసం ప్రభుత్వము వారికి పౌష్టికాహార కిట్ అందించడం జరుగుతుంది. జిల్లా ఆసుపత్రి కొండాపూర్ లో క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహార కిట్ల్ అందజేయడం జరిగింది. ఆసుపత్రి ఆర్. ఎం. ఓ. డాక్టర్ చంద్రకృష్ణ మాట్లాడుతూ ... క్షయ వ్యాధికి సంబంధించిన పరీక్షలు మందులు ఉచితంగా ఇవ్వడం జరుగుతుందని తెలియజేశారు. అలాగే ప్రతి క్షయ వ్యాధిగ్రస్తునికి పోషణ భత్యం నిమిత్తం నెలకు వెయ్యి రూపాయలు ఇవ్వడం జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చంద్ర కృష్ణ, బీములు సూపర్వైజర్, సతీష్ స్టాటిస్టికల్ అసిస్టెంట్, సంతోష్ కుమార్ హెల్త్ విజిటర్, ప్రసన్నలత ల్యాబ్ టెక్నీషియన్ తదితరులు పాల్గొన్నారు.

# ఆగని నేరాలు.. పెరిగిన చోరీలు



తొలిఅడుగు : హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పోలీసులకు కేసులకు సంబంధించి నగరంలో సంచలనం కలిగినప్పటికీ పోలీసుల్లో మాత్రం చలనం లేదు. ఎప్పటికప్పుడు దొంగలను పట్టుకునే ప్రయత్నాలు కొనసాగిస్తున్నామని సమీక్ష సమావేశాల్లో చెబుతున్నా.. ఆ తర్వాత ఎటువంటి అడుగూ ముందుకు పడటం లేదు. ముఖ్యంగా రివార్డులు ప్రకటించడమే తప్ప చోరీలు, హంతకుల జాడ కనిపెట్టడంలో మానవ వనరుల వినియోగం తగ్గిపోయిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇదే సమయంలో టెక్నాలజీపై పూర్తిగా ఆధారపడటంతో దొంగలు వీరి కంటే ఆలస్యంగా తమ గమ్యస్థానాలకు చేరినప్పటికీ పోలీసులు నిందితులను పట్టుకోలేకపోయారు. హైదరాబాద్‌లో ఏటా 8 నుంచి 9వేల చోరీ కేసులు నమోదవుతున్నాయి. వాటిలో ఎక్కువగా ఇండ్లలోనే జరుగుతున్నాయి.

గతమెంతో ఘనం..

ఎంత పెద్ద ఘరానా దొంగల ముఠా అయినా హైదరాబాద్ పోలీసుల నుంచి తప్పించుకోలేరన్న పేరు కమిషనరేట్‌కు ఉండేది. దేశంలోనే దొంగలను పట్టుకోవడంలో, నేరాలను అదుపుచేయడంలో గత ప్రభుత్వంలో ఘనమైన చరిత్ర కలిగిన హైదరాబాద్ పోలీసులు.. ప్రస్తుతం అంతర్రాష్ట్ర దొంగలను పట్టుకోవడంలో వెనకబడుతున్నారు. టెక్నాలజీ సహకారం లేకుండా తమ మేథస్సుతో మానవ వనరులతో సంచలన కేసులను ఛేదించిన హైదరాబాద్ పోలీసులు.. ప్రస్తుతం 24 గంటలు టెక్నాలజీ అందుబాటులో ఉంటున్నా.. నిందితులను పట్టుకోలేకపోతున్నారు.

సుమారు 1300 చోరీలు..

2023 లో వివిధ రకాల దొంగతనాలు 3063 జరిగితే 2024లో చోరీల సంఖ్య 3768 చోరీలు జరిగాయి. ఈ సంవత్సరం ఇప్పటివరకు సుమారుగా 1300 చోరీలు జరిగినట్లు అంచనా. అందులో కాచిగూడ, బంజారాహిల్స్, జూబ్లిహిల్స్, హిమాయత్‌నగర్, అఫ్జల్‌గంజ్ తదితర ప్రాంతాల్లో ఎక్కువగా చోరీలు జరిగినట్లు పోలీసులు చెబుతున్నారు. అంతర్రాష్ట్ర ముఠాలు సిటీలో తిరగడానికే భయపడే రోజుల నుంచి హైదరాబాద్‌కు వచ్చి చోరీ చేసి ఆరునెలల పాటు బయట ప్రాంతాల్లో ఎంజాయ్ చేసి మళ్లీ సిటీకి రావచ్చని ఇటీవల పోలీసులు పట్టుకున్న నేపాలీ దొంగలు చెప్పినట్లు సమాచారం.

గాలింపు దారి తప్పుతోందా..

దొంగలను పట్టుకోవడానికి బృందాలుగా వెళ్తున్న పోలీసుల గాలింపు చర్యలను దొంగలు తప్పుదారి పట్టిస్తున్నారని గాలింపు బృంద సభ్యుడొకరు చెప్పారు. టెక్నాలజీ వాడకంలో తమకంటే అడ్వాన్స్‌గా ఉండటం వల్ల తమ కదలికలను పసిగడుతున్నారని, దొంగల కదలికలను తాము పసిగట్టినప్పటికీ అక్కడకు చేరుకునే సమయానికి వారు పరారవుతున్నారని పోలీసులు పేర్కొన్నారు. ఈ విషయాన్ని సదరు పోలీసులు తమ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ పెద్దగా స్పందన లేదు. అఫ్జల్‌గంజ్ కేసు విషయంలోకానీ, కాచిగూడ కేసులో కానీ దొంగల కంటే పోలీసులే ముందుగా వారి ప్లాన్లు పసిగట్టారు. కానీ ఆచరణలో మాత్రం దొంగలు పోలీసుల కళ్లుకప్పి పారిపోయారు. కాసుల వేటలో పడుతున్న కొందరు ఖాకీలు కేసులను తప్పుదారి పట్టిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. సమీక్షలప్పుడు ఏదో ఒక సాకు చెప్పి తప్పించుకుంటున్నారు. ఈ క్రమంలో నిర్లక్ష్యాన్ని అలుసుగా తీసుకుంటూ.. పోలీసుల వైఫల్యాన్ని, నిర్లక్ష్యాన్ని అలుసుగా తీసుకుంటున్న దొంగల ముఠాలు నగరంపై పంజా విసురుతున్నాయి. పోలీసులు వారిని పట్టుకోలేక కొద్దిరోజులు గాలింపు చర్యలు చేపట్టి తర్వాత చేతులెత్తేస్తున్నారు. హైదరాబాద్‌లో జరుగుతున్న నేరాల నియంత్రణకు సంబంధించి ఎప్పటికప్పుడు సమీక్షలు పెట్టినా.. నేరాల రేటు తగ్గడం లేదని పోలీసు అధికారి ఒకరు చెప్పారు. దీనికి కారణం పోలీసు శాఖలో ఉన్న వివిధ విభాగాలు ప్రత్యేకించి సీసీఎస్‌లో కొందరు పోలీసు అధికారుల తీరు నేరగాళ్లను పట్టుకోవడంలో వైఫల్యానికి కారణమన్న అభిప్రాయాన్ని ఆ అధికారి వ్యక్తం చేశారు.

# ఇందిరమ్మ ఇండ్లకు శంకుస్థాపన

**– ముఖ్య అతిథిగా పాల్గొన్న మార్కెట్ కమిటీ డైరెక్టర్ కరుణాకర్..**



తొలి అడుగు, షాద్ నగర్, మే 23 : షాద్నగర్ నియోజకవర్గం కేశంపేట్ మండలంలోని కొండారెడ్డిపల్లిలో షాద్నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆదేశానూసారంగ కొండారెడ్డిపల్లిలో ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఇందిరమ్మలకు అధికారులతో పాటు షాద్నగర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ సిద్ధి శెట్టి శెట్టి కరుణాకర్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో నాణ్యత లోటు లేకుండా చూడాలని ఇంటి నిర్మాణానికి అవసరమయ్యే పనులను త్వరగా పూర్తి చేయాలని మార్కెట్ కమిటీ డైరెక్టర్ కరుణాకర్ అన్నారు. అనంతరం లబ్ధిదారులు మాట్లాడుతూ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కి మరియు సీఎం రేవంత్ రెడ్డికి ఎప్పటికీ రుణపడి ఉంటామని వారికి ధన్యవాదాలు తెలిపారు.

# క్షయ వ్యాధి పేషెంట్లకు న్యూట్రిషన్ కిట్లు పంపిణీ చేసిన..

**– షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్..**

**– డాక్టర్ వి విజయలక్ష్మి డిప్యూటీ డిఎం అండ్ హెచ్ ఓ..**




తొలి అడుగు, షాద్ నగర్, మే 23 : ఈరోజు షాద్ నగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో షాద్నగర్ డిప్యూటీ డిఎం హెచ్ ఓ డాక్టర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో, జిల్లా క్షయ వ్యాధి అధికారి డాక్టర్ పాపారావు, టి. బి అలర్ట్ ఇండియా స్వచ్ఛంద సంస్థ వాళ్లు అందజేసిన న్యూట్రిషన్ కిట్లను, షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేతుల మీదుగా క్షయ వ్యాధి పేషెంట్లకు పంపిణీ చేయడం జరిగింది అని డాక్టర్ విజయలక్ష్మి తెలియజేశారు. ఈ కిట్లలో 3 కిలోల గోధుమపిండి, 3 కిలోల బియ్యము, 1 కిలో కందిపప్పు, 1 కిలో పల్లీలు మరియు 1/2 కిలో బెల్లం ఏర్పాటు చేయడం జరిగింది డాక్టర్ విజయలక్ష్మి తెలియజేశారు. క్షయ వ్యాధి లక్షణాలు ఏమిటి అంటే ప్రజలలో ఎవరికైనా రెండు వారాలకు మించి దగ్గు, జ్వరము మరియు రాత్రిపూట చెమటలు పట్టడం, బరువు తగ్గడం, చాతిలో నొప్పి ఉన్నట్లయితే వారికి చేవ్యాధి ఉండవచ్చు అని అనుమానించవచ్చు అని, ఈ పై లక్షణాలు ఉన్నవారు షాద్నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చి తెమ్మడ పరీక్ష మరియు ఎక్సరే పరీక్ష చేయించుకున్నట్లయితే క్షయ వ్యాధి ఉందా లేదా అని నిర్ధారించవచ్చునని తెలియజేశారు. తదుపరి షాద్నగర్ శాసనసభ్యులు వీర్లపల్లి శంకర్ క్షయ వ్యాధిగ్రస్తులను ఉద్దేశించి మాట్లాడుతూ, పూర్వము క్షయ వ్యాధి సోకింది అంటే అతను కచ్చితంగా చనిపోతారు అనే అపోహ ఉండెను, ఇప్పుడు అలాంటి భయము ఏమి లేదు అని, క్షయ వ్యాధిగ్రస్తులకు తెలంగాణ ప్రభుత్వము ఖరీదైన ఉచిత మందులను అందజేయడంతో పాటు, ప్రతి పేషంట్ కి, ప్రతి నెల తెలంగాణ ప్రభుత్వము పేషంటు ల యొక్క పోషకహారము కొరకు, ప్రతి పేషెంట్ యొక్క అకౌంట్లో 1000 రూపాయలు జమ చేస్తుంది అని తెలియజేశారు. అందువలన పేషెంట్లు అందరూ కూడా మందులను తప్పకుండా రెగ్యులర్గా తీసుకున్నట్లయితే, వారి యొక్క ఆరోగ్యము బాగుపడి హెల్తీగా జీవనం గడపవచ్చని తెలియజేశారు. ప్రస్తుతము టీ.బీ అలర్ట్ ఆఫ్ ఇండియా స్వచ్ఛంద సంస్థ అందజేస్తున్న ఈ కిట్లను కూడా పేషెంట్లు సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో షాద్నగర్ ప్రభుత్వ ఆసుపత్రి ఇన్చార్జి సూపర్డెంట్ డాక్టర్ విష్ణు , వైద్యాధికారులు, హెల్త్ ఎడ్యుకేటర్ జి శ్రీనివాసులు, మార్కెట్ వైస్ చైర్మన్ ఆలీబాబా ఖాన్, షాద్నగర్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చెంది తిరుప రెడ్డి, టీబీ సూపర్వైజర్లు రవికుమార్, షఫీ, సంధ్య, మరియు ఆరోగ్య సిబ్బంది అన్వర్, లింగం, గౌస్, మరియు కాంగ్రెస్ కార్యకర్తలు, ఆశలు పాల్గొన్నారు..

# ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ను కలుసుకున్న షాద్ నగర్ ఏసిపి లక్ష్మీనారాయణ..



తొలి అడుగు, షాద్ నగర్, మే 23 : షాద్ నగర్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ఏసిపి) గా బదిలీపై ఇక్కడికి వచ్చి బాధ్యతలు స్వీకరించిన లక్ష్మీనారాయణ స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ను మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఏసీబీ తన పరిచయాన్ని చేసుకున్నారు. సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. శాంతిభద్రతల పర్యవేక్షణలో ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని ఈ ప్రాంతంలో ప్రజలకు ఎప్పుడు ఏ అవసరమైన పోలీసు శాఖ తరపున సత్వర సేవలు అందజేయాలని సూచించారు.

# శ్రీశైలంకు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి చేయూత

**– రాష్ట్ర బిజెపి కార్యవర్గ సభ్యులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి..**



తొలి అడుగు, షాద్ నగర్, మే 23 : చౌలపల్లి గ్రామంలో పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి సహకారంతో ఏర్పాటు చేసినటువంటి శ్రీశైలం యొక్క కిరాణా జనరల్ స్టోర్, ముఖ్యఅతిథినిగ పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి పాల్గొనడం జరిగింది, షాప్ యొక్క యజమాని కన్నతల్లితో షాప్ ప్రారంభించడం జరిగింది, యజమాని శ్రీశైలం మాట్లాడుతూ వికలాంగుడిని అయినా నాకు నేడు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి గారు, మరియు గ్రామస్తులు స్నేహితుల సహకారంతో నాకు ఈ షాపు ఏర్పాటు చేయించారు ఆయనకు ఎంతో రుణపడి ఉంటానాని ఆ దేవుడు ఎల్లవేళలా ఆయనని కాపాడాలని కోరుకుంటున్నాను. మాధవసేవే మానవసేవ అన్నట్టు ఆయన ప్రజల లో నిత్యం ఉంటారు. ఈ కార్యక్రమంలో అతిథులుగా పసుల నరసింహా, కర్రెడ్ల నరేందర్ రెడ్డి, తోట కృష్ణ మరియు గ్రామ పెద్దలు కార్యకర్తలు పాల్గొనడం జరిగింది..

# నక్సల్ బరిలో షాద్ నగర్ యువతి

**– పోలీస్ ఎన్ కౌంటర్ కన్నుమూసిన విజయలక్ష్మి అలియాస్ భూమిక**

**– 12 ఏళ్లుగా అజ్ఞాతంలోనే..**

**– ఉద్యమాలకు ఆకర్షితురాలై వెళ్లి మృత్యువు ఒడిలోకి..**

**– సొంత గ్రామము కేశంపేట మండలం వేములనర్వ**

తొలి అడుగు, షాద్ నగర్, మే 23 : ఉన్నత చదువులకు హైదరాబాద్ వెళ్లిన యువతి అక్కడి నుంచే అన్నల ఉద్యమబాట పట్టింది. పన్నెండు ఏళ్లుగా అజ్ఞాతంలోనే ఉండి ఛత్తీస్గడ్ లో జరిగిన ఎన్ కౌంటర్ లో కన్నుమూసింది. ఆమె రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గంలోని కేశంపేట మండలం వేములనర్వ గ్రామానికి చెందిన వన్నాడ విజయలక్ష్మి అలియాస్ భూమిక. గ్రామంలోని వన్నాడ సాయిలు గౌడ్ మొదటి భార్య రాధమ్మకు ముగ్గురు అడపిల్లలు. విజయలక్ష్మి మూడో సంతానం. విజయలక్ష్మి పుట్టిన ఏడాదికి పాము కాటుకు గురై రాధమ్మ మృతి చెందింది. విజయలక్ష్మి కేశంపేటలోని ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి వరకు చదివింది. అనంతరం అక్కడే ప్రైవేట్ పాఠశాలలో ఇంటర్మీడియెట్ పూర్తి చేసింది. డిగ్రీ మహబూబ్ నగర్లోని ప్రభుత్వ ఎన్టీఆర్ మహిళ కళాశాలలో చదివింది. అనంతరం నిజాం కళాశాలలో ఎల్ఎల్ బి చేస్తున్న సమయంలో ఉద్యమాల పట్ల ఆకర్షితురాలై ఉద్యమబాట పట్టిం ది. అప్పటి నుంచి కుటుంబ బంధాలను తెంచుకుంది. ఉద్యమంలోకి వెళ్లిన తర్వాత విజయలక్ష్మితో ఎప్పుడూ మాట్లాడలేదని, గ్రామంలోకి రాలేదని కుటుంబ సభ్యులు తెలిపారు. చదువుకుంటున్న సమయంలో గ్రామంలో చిన్నపిల్లలకు ఉచితంగా ట్యూషన్లు చెప్పినట్టు గ్రామస్తులు తెలిపారు.

షాక్ లో గ్రామస్తులు..

విజయలక్ష్మి పన్నెండేళ్ల క్రితం గ్రామాన్ని వదిలి తిరిగి రాకుండా అజ్ఞాతంలోకి వెళ్లిపోయింది. ఎక్కడో చత్తిస్గడ్ రాష్ట్రంలో జరిగిన ఆపరేషన్ కగార్ లో మృత్యుపాలైయిందని తెలిసి గ్రామస్తులు ఆశ్చర్యానికి గురయ్యారు. ఇన్నాళ్లు ఎక్కడ ఉందో ఏం చేస్తుందో తెలియక విజయలక్ష్మి గురించి కుటుంబ సభ్యులు గ్రామస్తులు ఏనాడో మర్చిపోయారు. మళ్లీ ఈనాటికి నక్సల్ బరిలో ఉంటూ ఉద్యమాల కోసమే ఊపిరి పోయిందన్న సమాచారం తెలుసుకుని గ్రామస్తులు షాక్ కు గురయ్యారు..





# హెలిఫ్యాడ్ స్థల పరిశీలన చేస్తున్న తలశిల, బూచేపల్లి,అన్నా,ఉడుమల,చుండిరి,బన్ని





తొలి అడుగు : ప్రకాశం జిల్లా, మే 23 : ప్రకాశం జిల్లా పొదిలి టౌన్ నందు పొగాకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతూ ఈ నెల 28వ తేదీన రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, వైస్సార్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మార్కాపురం నియోజకవర్గ పరిధిలోని పొదిలి పట్టణానికి విచేయుచున్న సందర్భంగా హెలిఫ్యాడ్ స్థల పరిశీలన చేస్తున్న జగన్ మోహన్ రెడ్డి ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ శాసనమండలి సభ్యులు తలశిల రఘురామ్, ప్రకాశం జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు,దర్శి శాసనసభ్యులు బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి, గిద్దలూరు మాజీ శాసనసభ్యులు, మార్కాపురం నియోజకవర్గ వైస్సార్సీపీ సమన్వయకర్త అన్నా రాంబాబు, కంభం మాజీ శాసనసభ్యులు ఉడుముల శ్రీనివాసరెడ్డి, ఒంగోలు నియోజకవర్గ వైఎస్సార్సీపీ సమన్వయకర్త చుండూరి రవి, ప్రకాశం జిల్లా మాజి పి.డి.సి.సి.చైర్మన్ వై. ఎమ్.ప్రసాద్ రెడ్డి(బన్నీ) మరియు తదితర నాయకులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

గ్రీన్‌గ్యాస్‌కు గ్లోబల్ ట్యాక్స్...

గ్లోబల్ వార్మింగ్ కట్టడికోసం గ్రీన్‌హౌస్ ఉద్గారాల (హరిత వాయువుల వెల్లువ)పై గ్లోబల్ ట్యాక్స్ విధించడానికి షిప్పింగ్ వనరుగా ఉన్న ప్రధాన దేశాలు అంగీకారం తెలిపాయి. దీని ప్రకారం నౌకలు విడుదల చేసే ప్రతి టన్ను కార్బన్ డైయాక్సైడ్‌పై ఇకనుంచి కనీసం 100 డాలర్ల వంతున పన్ను విధించనున్నాయి. ఆయా దేశాల నౌకలు లక్ష్యాలను చేరలేకపోయినా, ఇంటర్నేషనల్ మారిటైం ఆర్గనైజేషన్ నెట్ జీరో ఫండ్‌కు నిధులు అందించకున్నా 2028 నుంచి ఈ ట్యాక్స్‌ను వసూలు చేయనున్నారు. ఇందుకు సంబంధించి ఏప్రిల్ 11న లండన్‌లో 60కి పైగా దేశాల ప్రతినిధులతో ఇంటర్నేషనల్ మారిటైం ఆర్గనైజేషన్ (ఐఎంఒ) సమావేశం జరిగింది. అయితే అగ్రరాజ్యం అమెరికా మాత్రం దీనికి గైర్హాజరు కావడం గమనార్హం. ఓడల్లో వాడే ఇంధనానికి సైతం ఈ సమావేశం పలు ప్రమాణాలను నిర్దేశించింది. మొత్తం ఉద్గారాల్లో షిప్పింగ్ వాటా 3 శాతమని ఐక్యరాజ్యసమితి గణాంకాలు చెబుతున్నాయి. ఓడల సంఖ్యతోపాటు వాటి పరిమాణం పెరుగుతుండడం, అందుకు అనుగుణంగా ఇంధనవాడకం విపరీతంగా పెరిగిపోతుండటంతో రానున్న రోజుల్లో షిప్పింగ్ ఉద్గారాలు ఇంకా ఎక్కువవుతాయని భావిస్తున్నారు. ఐఎంఒ భేటీలో కుదిరిన ఒప్పందంపై సెక్రటరీ జనరల్ ఆర్సెనియో డొమింగెజ్ హర్షం వెలిబుచ్చారు. వాతావరణ మార్పులను ఎదుర్కోవడానికి షిప్పింగ్ ఆధునికీకరణకు ఎన్నో సంక్లిష్టమైన సవాళ్లను ఎదుర్కొంటూ ఈ బృందం అర్థవంతమైన ఏకాభిప్రాయాన్ని సాధించిందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రపంచ వాణిజ్యానికి సముద్ర నౌకా రవాణా అన్నది వెన్నుముక వంటిది. ఏటా సుమారు 12 బిలియన్ టన్నుల సరకు నౌకలపై రవాణా అవుతుందని యునైటెడ్ నేషన్స్ ట్రేడ్ అండ్ డెవలప్‌మెంట్ (యుఎన్‌సిటిఎడి) 2023 నివేదిక వెల్లడిస్తోంది. 2022లో సముద్ర వాణిజ్యం 0.4 శాతం తగ్గినా, కంటైనర్ల ద్వారా రవాణా (2024 నుంచి కంటైనర్ల రవాణా ఏటా 3% పెరుగుతోంది) చమురు, గ్యాస్ రవాణా 2022 నుంచి క్రమంగా 6%, 4.6 శాతం పెరుగుతుండడంతో 2028 నాటికి మొత్తం సముద్ర వాణిజ్యం 2.1% నుంచి 2.2% వరకు పెరుగుతుందని అంచనా. ఈ విధమైన పెరుగుదల ఇంధన వాడకానికి మరింత ఆజ్యం పోస్తుంది. గత దశాబ్దకాలంగా షిప్పింగ్ ఉద్గారాలు విపరీతంగా పెరుగుతున్నాయి. ఏటా విడుదలయ్యే ఒక బిలియన్ మెట్రిక్ టన్నుల కార్బన్‌డైయాక్సైడ్ ఉద్గారాలు, 3% గ్లోబల్ గ్రీన్‌హౌస్ గ్యాస్‌తో సమానం. భారీ నౌకలు ప్రతి ట్రిప్పుకు ఎక్కువ సరకును రవాణా చేస్తుంటాయి. భారీ మొత్తంలో ఇంధనాన్ని మండిస్తుంటాయి. పనామా, లిబేరియా, మార్షల్ దీవుల్లో ఇదే పరిస్థితి. ప్రపంచం మొత్తం మీద రవాణా అయ్యే టన్నుల సరకుల్లో మూడోవంతు ఈ రేవుల ద్వారానే జరుగుతుంది. అంతే సమానంగా ఉద్గారాలు విడుదల అవుతుంటాయి. ఇంటర్నేషనల్ మారటైమ్ ఆర్గనైజేషన్ (ఐఎంఒ) 2023 సవరించిన గ్రీన్‌హౌస్ గ్యాస్ (జిహెచ్‌జి)వ్యూహం (స్ట్రాటెజీ) ఆశించే లక్ష్యాలను నిర్దేశించింది. 2008 నాటి ఉద్గారాలస్థాయిలను ప్రామాణికంగా తీసుకుని 2030 నాటికి 20% నుంచి 30% వరకు ఉద్గారాలు తగ్గించాలని, 2050 నాటికి జీరో స్థాయికి చేరుకోవాలని నిర్దేశించింది.

అయినప్పటికీ, ఎలాంటి చొరవ తీసుకోకుంటే ఉద్గారాలు మరింత ఎక్కువగా పెరుగుతాయని అంచనా వేశారు. యునైటెడ్ నేషన్స్ ట్రేడ్ అండ్ డెవలప్‌మెంట్ గుర్తించడం బట్టి భౌగోళిక రాజకీయ మార్పులు, ఉక్రెయిన్ యుద్ధం వంటి పరిణామాలు, మళ్లీ చమురు, ఆహార ధాన్యాల నౌకల రవాణా టన్నుల భారం కన్నా మరింత దూరం సాగేలా చేస్తున్నాయి. 2023లో చమురు రవాణా దూరంతోపాటు సుదీర్ఘకాలం సాగింది. ఐఎంఒ మెరైన్ ఎన్విరాన్‌మెంట్ కమిటీ నిర్ణయించిన గ్లోబల్ కార్బన్ టాక్స్ మేరకు ఆయా లక్ష్యాల నౌకలు నెట్ జీరో నిధులను అందించడం కానీ, లేదా ఉద్గారాల నియంత్రణ కానీ చేయలేకపోతున్నాయని వ్యాఖ్యానించింది. ఇది వాడుతున్న ఇంధన ప్రమాణాల బట్టి ఆధారపడి ఉంది. ఉద్గారాలను పూర్తిగా, లేదా కొంత స్థాయివరకు తగ్గించడానికి దోహదపడే హైడ్రోజన్, మెథనాల్, అమెనియా వంటి వాటిని ప్రోత్సహించడం అవసరం. ప్రకృతికి విరుద్ధమైన మానవ కార్యకలాపాల వల్ల భూమి వేడెక్కిపోతూనే ఉంది. 1850లో భూ ఉష్ణోగ్రతను నమోదు చేయడం మొదలైనప్పటి నుంచి అత్యుష్ణ సంవత్సరంగా 2023 రికార్డు సృష్టించగా, వెంటనే 2024 ఆ రికార్డును బద్దలు కొట్టింది. ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్లూఎంఒ) గత జనవరిలో ఈమేరకు ఓ నివేదిక విడుదల చేసింది.

అసలు గడచిన పదేళ్లు భూమిపై గత 125000 ఏళ్లలోనే అత్యుష్ణ సంవత్సరాలని ఐరోపా, బ్రిటన్, జపాన్ దేశాల వాతావరణ సంస్థలు నిర్ధారించాయి. బొగ్గు, చమురు ఆధారిత పారిశ్రామిక విప్లవం వచ్చినప్పటి నుంచి భూ ఉష్ణోగ్రత పెరుగుతూ వస్తోంది. ఈ పెరుగుదల 1.5 సెల్సియస్ డిగ్రీలకు (2.7 ఫారన్ హీట్) మించకుండా చూడాలని 2015లో పారిస్ వాతావరణ సభ తీర్మానించింది. కానీ ఈ ఏడాది భూ ఉష్ణోగ్రత ఆ పరిమితిని మించి 1.6 సెల్సియస్ డిగ్రీలకు పెరిగిందని ఐరోపా కమిషన్‌కు చెందిన కొపెర్నికస్ వాతావరణ విభాగం తెలిపింది. జపాన్ ఈ పెరుగుదలను 1.57 డిగ్రీలుగా, బ్రిటన్ 1.53 డిగ్రీలుగా లెక్కగట్టాయి. వాతావరణ మార్పుల వల్ల వరదలు, తుపానులు, అనావృష్టి తలెత్తి గత ఏడాది ప్రపంచ వ్యాప్తంగా 14,000 కోట్ల డాలర్ల నష్టం జరిగింది. శిలాజ ఇంధనాలైన బొగ్గు, చమురు, సహజ వాయువులను మండించడం వల్లనే వాతావరణంలో కర్బనం పెరిగి ఉష్ణోగ్రతను పెంచుతోంది. పారిశ్రామిక విప్లవంనుంచి సంపన్న ఐరోపా, అమెరికా ఖండ దేశాలు శిలాజ ఇంధనాలను మండించడం ద్వారా ప్రపంచానికి 170 లక్షల కోట్ల డాలర్ల నష్టం కలిగించాయి. ఈ నష్టాలను అధిగమించడానికి వర్ధమాన దేశాలకు లక్షల కోట్ల డాలర్ల సహాయం చేయాల్సిన సంపన్న దేశాలు కేవలం 30,000 కోట్ల డాలర్లను అదీ 2035 కల్లా విదిలిస్తామని ప్రతిపాదించాయి. భూగోళం వేడెక్కడ మనేది కఠోరమైన వాస్తవమని డబ్లుఎంఒ తాజా నివేదిక మరోసారి రుజువు చేస్తోందని ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ వ్యాఖ్యానించారు. భూతాపం పెరగడం మాతాశిశు ఆరోగ్యాన్ని కూడా దెబ్బతీస్తోంది. వేడి ఎక్కువగా ఉండే రోజుల సంఖ్య పెరుగుతున్నందున నెలలు నిండక ముందే శిశు జననాలు సంభవిస్తున్నాయి. తల్లులకు ఆరోగ్య సమస్యలు వస్తున్నాయి. 202024 మధ్య కాలంలో 247 దేశాలు, 940 నగరాల్లో అధిక వేడిరోజులు రెట్టింపు అయ్యాయని తేల్చారు. గడిచిన అయిదేళ్లలో భారత్‌లో గర్భిణులకు ప్రమాదకరమైన రీతిలో జాతీయ స్థాయిలో ఏటా సగటున ఆరు అదనపు అత్యుష్ణ రోజులు నమోదైనట్టు నివేదికలు చెబుతున్నాయి.

## నియోజకవర్గంలోని మీడియా మిత్రులకు అన్ని విధాలుగా అండగా ఉంటా - ఎమ్మెల్యే అశోక్ రెడ్డి






తొలి అడుగు, ప్రకాశం జిల్లా, మే 23 : ప్రకాశం జిల్లా గిద్దలూరు నియోజకవర్గంలోని మీడియా మిత్రులందరికీ అన్ని విధాలుగా అండగా ఉంటానని ఎమ్మెల్యే అశోక్ రెడ్డి అన్నారు. ఒంగోలులోని డీ మార్ట్ ప్రక్కన ఎమ్ఎస్ కళ్యాణమండపంలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ 6వ మహాసభకు హాజరైన ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని విలేకర్లందరికి అన్ని విధాలుగా అండగా ఉంటానని, విలేకరులకు ఎటువంటి సహాయం కావాలన్న తనని సంప్రదించవచ్చని ఆయన అన్నారు.

## అనంతపురం అమరావతి జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం

### కారు లారీ ఢీకొని ఆరుగురు సంఘటన స్థలంలోనే మృతి చెందారు







తొలి అడుగు, ప్రకాశం జిల్లా, మే 23 : ప్రకాశం జిల్లా కొమరోలు మండలం తాటిచెర్ల మోటు గ్రామ సమీపంలోని అమరావతి అనంతపురం జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. లారీ, కారు ఢీకొన్న సంఘటనలో ఆరుగురు అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఇద్దరు చిన్నారులకు తీవ్ర గాయాలు కావడంతో వారిని 108 వాహనంలో గిద్దలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతులలో ఇద్దరు మహిళలు నలుగురు పురుషులు ఉన్నారు. మృతులు బాపట్ల మండలం స్టువర్టుపురం గ్రామానికి చెందిన వారుగా పోలీసులు గుర్తించారు. మృతులు గజ్జల అంకాలు (40) గజ్జల భవాని (25) గజ్జల నరసింహులు (20) బొచ్చు సన్నీ (30) కర్రెద్దుల దివాకర్ (30) గజ్జల బబ్బులు (30) గజ్జల జనార్ధన్ (30) గా పోలీసులు తెలిపారు. గాయపడ్డ చిన్నారులలో జీతన్ పరిస్థితి విషమంగా ఉండటగా శిరీష కు తీవ్ర గాయాలయ్యాయి. వీరు ప్రస్తుతం గిద్దలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వ్యక్తిగత పనులపై మీరు నంద్యాల జిల్లా డోన్ కు వెళ్లి వస్తుండగా రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. కారు డ్రైవర్ దివాకర్ నిర్లక్ష్యంగా కారు నడపడం వల్లే రోడ్డు ప్రమాదం జరిగిందని విచారణలో పోలీసులు గుర్తించారు. ప్రమాద స్థలాన్ని డీఎస్పీ నాగరాజు పరిశీలించారు. మృతదేహాలన్నిటిని పోస్టుమార్టం కొరకు గిద్దలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

## దళిత మంత్రి స్వామి ఇలా కాలు బుద్ధుడు మరియు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి ఊరేగింపులను అడ్డుకున్న వారిని కఠినంగా శిక్షించాలని

– దళిత నేత నీలం నాగేంద్రరావు




తొలి అడుగు, ప్రకాశం జిల్లా, మే 23 : ప్రకాశం జిల్లా జరుగుమల్లి దళిత మంత్రి స్వామి ఇలాకాలో బుద్ధుడు మరియు అంబేద్కర్ జయంతి ఊరేగింపులను అడ్డుకున్న ఘటనలపై40 రోజులైనా వీడియో వైరల్ అయిన అధికార తెలుగుదేశం నాయకుల లో కేసు కట్టనందుకు నిరసనగా నేడు జరుగుమల్లి పోలీస్ స్టేషన్ ముందు బాధితులతో కలిసి జరుగుమల్లి ఎస్ఐ ను సస్పెండ్ చేయాలని అంబేద్కర్ను అవమానించిన అగ్రకుల నిందితులను అరెస్టు చేయాలని దళిత నేత నీలం నాగేంద్రరావు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగినది ఈ కార్యక్రమంలో దల సంఘాల నాయకులు అంబటి కొండలరావు కెవిపిఎస్ జిల్లా నాయకులు రఘురాం మరియు మోజస్ కాకుమాను రవి కంకణాల ఆంజనేయులు ఫిర్యాదుదా మద్దిరాల జగదీష్ తదితరులున్నారు.

## కాంగ్రెస్ నాయకుడికి ఘన నివాళులు అర్పించిన పూజల హరికృష్ణ

– పార్టీ జెండా కప్పి ఆర్థిక సహాయం అందజేసిన నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ పూజల హరికృష్ణ





తొలి అడుగు, చిన్నకోడూరు, మే 23 : చిన్నకోడూరు మండల పరిధిలోని చంద్లపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు %ంఐ% సెల్ రాష్ట్ర కన్వీనర్ కొమ్ముగల్ల లక్ష్మణ్ హార్ట్ ఏటాక్ తో మరణించిన విషయం తెలుసుకొని చిన్నకోడూరు మండల అధ్యక్షులు మీసం మహేందర్ తో కలిసి చంద్లపూర్ లక్ష్మణ్ నివాసంకు వెళ్ళి కుటుంబ సభ్యులను ఓదార్చి 5000 రూపాయల ఆర్థిక సహాయం అందజేయడం జరిగింది ఈ సందర్భంగా నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ హరికృష్ణ మాట్లాడుతూ బాధిత కుటుంబనీకి అన్ని వేళల అండగా ఉంటానన్నారు అంతేకాకుండా ఆయన భౌతికకాయనికి పార్టీ జెండా కప్పి పూల మాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు ఈ కార్యక్రమం లో నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు ఎర్ర మహేందర్,సాంబమూర్తి, చాంది శ్రీనివాస్, ప్రవీణ్,ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్ పొన్నాల రాజేష్ మండల కన్వీనర్ కొమ్ము ప్రశాంత్, ఎస్సీ సెల్ మాజీ మండల అధ్యక్షుడు నముండ్ల వినోద్, ఫిషర్ మెన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుండు వెంకట్, యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ బత్తిని గణేష్ యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బస్సా వంశీ,సీనియర్ నాయకులు,హరిబాబు, భాస్కర్ గౌడ్, కనకయ్య, మంద శ్రీకాంత్, కొమ్ము రాజు, నక్క రాజు, కర్రె మధు, గొట్టిపర్తి చందు, కొమ్ము ఎల్లయ్య, తదితరులు ఉన్నారు.

# జనగామ అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహా అన్నదానం

తొలిఅడుగు, జనగామ, మే 23 : ఈరోజు జనగామ పట్టణానికి చెందిన మేడిపల్లి కళ్యాణ్ జయంతి సందర్భంగా వారి అన్న మేడిపల్లి కార్తిక్ జనగామ అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక జనగామ రైల్వే స్టేషన్ వద్ద మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించి తన తమ్ముడిని స్మరించుకోవడం జరిగింది. జనగామ అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంతెన మణి కుమార్ మరియు ముఖ్య సలహా దారులు వంగ భీమ్ రాజ్ మాట్లాడుతూ మేడిపల్లి కళ్యాణ్ చేంజ్ సందర్భంగా అన్నదానం నిర్వహించిన కుటుంబ సభ్యులకు పేరుపేరునా ధన్యవాదములు జనగామ అమ్మ ఫౌండేషన్ ఆలోచన ఆశయంలో ప్రజలు యువత పెద్ద ఎత్తున పుట్టినరోజు పెళ్లిరోజు మరియు సందర్భం ఏదైనా కానీ ఆకలితో ఉన్నవారికి ఒక పూట ఆకలి తీర్చి మానవత్వం అని చాటుకుంటున్నారని భారత దేశంలో ఆకలి చావులు లేకుండా నియంత్రణ లక్ష్యంగా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో వారి స్నేహితులు కార్తీక్, సోహెల్, విజయ్,పవన్, లింగం, చింటూ, శ్రీకాంత్, జంపి, అమ్మ ఫౌండేషన్ టీమ్ సభ్యులు సల్ల మహేష్, మద్దెల కార్తిక్, మహమ్మద్ ఆఫ్రొజ్, మహమ్మద్ యాకూబ్, తదితరులు పాల్గొన్నారు



# లాభాల్లో ట్రేడవుతున్న దేశీయ స్టాక్ మార్కెట్లు

తొలిఅడుగు దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు శుక్రవారం ఫ్లాట్‌గా ప్రారంభమయ్యాయి. అంతర్జాతీయ మార్కెట్లలో మిశ్రమ సంకేతాల నడుమ మదుపర్లు ఆచితూచి వ్యవహరిస్తున్నారు. దీంతో ఫ్లాట్‌గా ప్రారంభమైన సూచీలు ప్రధాన షేర్లలో కొనుగోళ్ల అండతో ప్రస్తుతం లాభాల్లో ట్రేడవుతున్నాయి. ఉదయం 9 గంటల 27 నిముషాల సమయంలో సెన్సెక్స్ 235 పాయింట్ల లాభంతో 81,251 వద్ద ట్రేడవుతుండగా.. నిఫ్టీ 114 పాయింట్ల లాభంతో 24,728 వద్ద ఉన్నాయి. సెన్సెక్స్‌లోని 30 షేర్లలో ఎటర్నల్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, ఐటీసీ, ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, బజాజ్ ఫిన్‌సర్వ్, అల్ట్రాటెక్ సిమెంట్, టెక్ మహీంద్రా, నెస్లే ఇండియా, అదానీ పోర్ట్స్, టాటా స్టీల్ లాంటి షేర్లు లాభాల్లో ట్రేడవుతున్నాయి. సన్ ఫార్మా, ఐసీఐసీఐ బ్యాంక్, మహీంద్రా అండ్ మహీంద్రా (ఎంఅండ్ఎం), టైటాన్ షేర్లు నష్టాల్లో కదలాడుతున్నాయి.

# వర్గల్ మండలం లో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలీ



తొలిఅడుగు, గజ్వేల్, మే 23 : సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం లో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు బొల్లిపల్లి తిరుపతి రెడ్డి అధికారులను కోరారు. మండలంలోని నెంటూర్ ఐకెపి దాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి, అకాల వర్షానికి తడసిన ధాన్యాన్ని పరిశీలించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. రైతులకు కావాల్సిన కనీస సదుపాయాలు కల్పించాలని మండల వ్యవసాయ అధికారి శేషశయనకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాదారం మాజీ ఉప సర్పంచ్ ఎల్లం, బూత్ అధ్యక్షులు ఎర్రవల్లి వెంకట్ గౌడ్, ఎర్రవల్లి ప్రవీణ్ గౌడ్, రామాంజనేయులు, శ్రీపతి, నాయకులు ప్రదీప్ గౌడ్, శంకర్ గౌడ్, ఎర్రవల్లి మధు గౌడ్, కిచ్చుగారి పాండు, శ్రీనివాస్ మరియు యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# స్కూల్ బస్సుల ఫిట్నెస్ పై అవగాహన కల్పించిన భద్రాచలం మోటార్ వెహికల్ ఇన్ స్పెక్టర్ సంగం వెంకటపుల్లయ్య

**– కార్యక్రమం ఏర్పాటు చేయడం పట్ల హర్షం వ్యక్తం సామాజిక సేవకులు కర్నే బాబురావు**





తొలిఅడుగు, మణుగూరు, మే 23 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వెంకట పుల్లయ్య స్కూల్స్, కాలేజీలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో స్కూల్ బస్సు ఫిట్నెస్ ఇతర భద్రత విషయాలు భద్రాచలం యూనిట్ కార్యాలయంలో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. స్కూల్ బస్సులు కాలేజీ బస్సులు నడిపేటప్పుడు చాలా జాగ్రత్తగా తీసుకోవాలని సూచించారు. నియమ నిబంధన పాటించాలని స్కూల్ బస్సు ఫిట్నెస్ గా ఉండే విధంగా చూసుకోవాలని పేర్కొన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ సమయానికి రెన్యువల్ చేయించుకోవాలని మద్యపానం సెల్ ఫోన్ డ్రైవింగ్ లో దూరంగా ఉండాలని ట్రాఫిక్ రూల్స్ పై సరైన అవగాహన కలిగి ఉండాలని ఆయన తమ అవగాహన కార్యక్రమంలో డ్రైవర్లకు తెలిపారు తమ విజ్ఞప్తి పరిశీలించి డ్రైవర్లకు స్కూల్ బస్సు నడపటం మరియు విద్యార్థుల రక్షణకు సంబంధించి స్కూల్ బస్సులు తగు జాగ్రత్తలతో నడపాలని డ్రైవర్లకు అవగాహన కల్పించడం పట్ల మణుగూరు ఏరియా సామాజిక సేవకులు కర్నే బాబురావు పుల్లయ్యకి కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా స్కూల్ బస్సు డ్రైవర్లకు క్లీనర్లకు చట్టబద్ధంగా రావాల్సిన వేతనాలు మరియు ఇతర సౌకర్యాలకు సంబంధించి కూడా అధికారులు స్పందించి న్యాయం చేయాలి కోరారు.

# పరిసరాల పరిశుభ్రతే - మన ఆరోగ్యానికి శ్రీరామరక్ష. . .......

**– ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కుకునూరుపల్లి**
**– వైద్యాధికారిణి :డాక్టర్ ,అఖిల.**



తొలిఅడుగు, గజ్వేల్, మే 23 : సిద్దిపేట జిల్లా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కుకునూరుపల్లి పరిధిలోని రిమ్మనగూడ గ్రామంలో డ్రై- డే ఫ్రై-డే కార్యక్రమంలో భాగంగా గ్రామపంచాయతీ నుండి దాతర్ పల్లి రోడ్డు వరకు,దోకి స్వామి ఇంటి నుండి అంగన్వాడీ టీచర్ ఇంటి వరకు కమ్మ యాదగిరి ఇంటి నుండి చిప్ప నరసింహులు ఇంటి వరకు గ్రామపంచాయతీ నుండి జడ్పిహెచ్ఎస్ హైస్కూల్ వరకు మరియు గ్రామంలో ప్రధాన వీధుల గుండా ఇంటింటికి తిరిగి హెల్త్ ఎడ్యుకేషన్ ఇవ్వడం జరిగింది. ఇంటి పరిసరాలలో .మురుగునీటి గుంటలు లేకుండా చూసుకోవాలని ,ఇంటి ని ఏప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని పగిలిన కుండలు, టైర్లు, కొబ్బరి చిప్పలు, లేకుండా నీటి నిలువ లేకుండా చూసుకోవాలని ప్రజలను చైతన్యవంతం చేయడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికాని డాక్టర్ అఖిల గారు మాట్లాడుతూ ఋతుపవనాలు త్వరలో వస్తున్నాయని రాబోయే వర్షాకాలంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండి ఇంటి పరిసరాలను మురికి నీటి గుంటలు లేకుండా చూసుకోవాలని వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, ప్రతి మంగళవారం, శుక్రవారం డ్రై- డే ఫ్రై-డే పాటించి ఇంటిలో అపరిశుభ్రంగా ఉన్న పనికిరాని వస్తువులను బయటపడేసి, ఇంటిని, ఇంటి పరిసరాలను శుభ్రపరచుకోవాలన్నారు. ఇంట్లో ఉన్న చెత్తాచెదారని ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని, ఇంటిలోకి దోమలు రాకుండా దర్వాజలకు, కిటికీలకు, జాలిలు బిగించుకోవాలని

ఓడ మాస్, గుడ్ నైట్ వాడి దోమల నుండి రక్షణ పొందాలన్నారు, నిద్రిస్తున్న సమయంలో దోమతెరలు వాడాలని, వేడివేడి ఆహార పదార్థాలు తినాలని, ఎవరికైనా జ్వరాలు, జలుబు, వాంతులు, విరోచనాలు ,అయితే వెంటనే గ్రామంలో ఆశ వర్కర్స్ గాని, స్థానిక ఏఎన్ఎం కు గాని దగ్గరలో ఉన్న హాస్పిటల్లో సంప్రదించగలరని కోరనైనది. ఈ కార్యక్రమంలో గజ్వేల్ సబ్ యూనిట్ ఆఫీసర్ బి. శ్రీనివాస్ ఎం. పి. హెచ్. ఈ.వో .%దీ%.ప్రేమ్ చందు. హెల్త్ అసిస్టెంట్ దేవసాని వాసుదేవ్, ఫీల్డ్ వర్కర్ %చీ% .రమేష్, విలేజ్ సెక్రెటరీ రామకృష్ణారెడ్డి, గ్రామపంచాయతీ సిబ్బంది యాదగిరి నర్సింలు, స్థానిక ,ఏఎన్ఎం మంజుల ,ఆశ వర్కర్లు హేమలత ,దర్గమ్మ, గ్రామ ప్రజలు పాల్గొని కార్యక్రమం విజయవంతం చేసినారు.


# పూస్తే మట్టెలు అందజేసిన వెంకటేష్ గౌడ్...



తొలిఅడుగు, గజ్వేల్, మే 23 : పేదింటి పెండ్లికి పూస్తే మట్టెలు అందజేసి శ్రీ నూతన గౌడ సంఘం రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ గుండుకాడి వెంకటేష్ అండగా నిలిచారు. వర్గల్ మండలం వేలూరు గ్రామానికి చెందిన అచయపల్లి సంజీవ్, ఎల్లవ్వ కూతురు వివాహానికి పూస్తే మట్టెలు అందజేసి ఆర్థికగా తోడున్నారు. ఆడ బిడ్డలకు పూస్తే మట్టెలు సహాయం చేస్తూ తనకు తోచిన సహాయం చేస్తున్నానని తెలిపారు. దయానియ స్థితిలో ఉన్న ఆ పేద కుటుంబాని అదుకోవడానికి చిరు సహాయం అందించామన్నారు. ఇకముందు కూడా వీలైనంత వరకు సహాయం చేస్తానని వారు తెలిపారు

# వడ్ల కొనుగోలు వేగవంతం చేయాలి





తొలిఅడుగు, గజ్వేల్, మే 23 : జిల్లాలో వడ్ల కొనుగోలు వేగవంతం చేయాలని, ఐకెపి మరియు కోపరేటివ్ సొసైటీ పరిధిలో కొనుగోలు కేంద్రాలలో సరిపడ సంచులు, అందుబాటులో లారీలను ఉంచాలని సిపిఎం పార్టీ సిద్దిపేట జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సందబోయిన ఎల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు కొన్ని ప్రాంతాల్లో వడ్లు తడవడం జరిగిందని పూర్తిగా వడ్లను ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలు చేసి రైతు కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు సంచులు లేక లారీలు రాకపోవడంతో అనేక గ్రామాల్లో ఐకెపి సెంటర్లలో వడ్లు ఉంటున్నాయని అన్నారు. జగదేవ్పూర్ మండలం తిమ్మాపూర్ కొనుగోలు కేంద్రంలో వడ్ల తేమ11% వచ్చిన తడిచిన సంచుల్లో నింపడంతో మార్కెట్లో 43 కిలోలు భర్తి పెట్టి, జోకడం జరిగిందని మరల రైస్ మిల్ కు పోయిన తర్వాత సంచికి రెండు కిలోల చొప్పున తొలగించి ఓచర్ రాయడం జరిగిందని అన్నారు. వడ్లు తడవకుండానే క్వింటాల్కు పది కిలోలు చొప్పున కటింగ్ చేయడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు రైతులను అనేక విధాలుగా మోసం చేస్తున్న మిల్లు యజమానులపై చర్యలు తీసుకోవాలని రైతు కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కొనుగోలు కేంద్రాల్లో జరుగుతున్న పరిణామాలను రైతులు కనుక్కోవాలని, హమాలి పైసలు కూడా రైతుల నుండి కటింగ్ చేయడం జరుగుతుంది ప్రభుత్వం వెంటనే అమలు పైసలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు బండ స్వామి రంగారెడ్డి మాసాన్పల్లి కనకయ్య పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ మూడు ముక్కలాటతో దిగజారుతున్న కేటీఆర్ మానసిక పరిస్థితి

- పార్టీ నేతలు పిచ్చాసుపత్రిలో పరీక్షలు చేయిస్తే బాగుంటుంది
- ఏఎంసీ వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్



తొలిఅడుగు, గజ్వేల్, మే 23 : కాళేశ్వరం బారాజ్ లను కాంగ్రెస్ నేతలు బాంబులు పెట్టి కూల్చారని కేటీఆర్ ఆరోపించడం పట్ల ఆయన మానసిక పరిస్థితిపై అనేక అనుమానాలు వస్తున్నట్లు గజ్వేల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్ ఆరోపించారు. గజ్వేల్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజహర్ జిల్లా కిసాన్ సెల్ కార్యదర్శి ముమ్మద్ అజ్గర్ తోహిద్ తో కలిసి శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బిఆర్ఎస్ పార్టీలో మూడుముక్కలాట కొనసాగుతుండ%శీ%డం, అభద్రతాభావంతో ఉన్న ఆయన మానసిక పరిస్థితి రోజురోజుకు దిగజారుతుందని తెలిపారు. దీనిని దృష్టిలో పెట్టుకొని బిఆర్ఎస్ నేతలు ఆయనను పిచ్చాసుపత్రిలో చేర్పించి చికిత్స చేయించాలని సలహా ఇచ్చారు. ముఖ్యంగా ఎమ్మెల్సీ కవిత ఆమె తండ్రి కెసిఆర్ కు రాసిన లేఖతోనే బిఆర్ఎస్ పార్టీ దుస్థితి అర్థమవుతుండగా, తమ తప్పిదాలను కప్పిపుచ్చుకోవడానికి కేటీఆర్ తంటాలు పడుతున్నట్లు చెప్పారు. కాళేశ్వరం అవినీతిని కాంగ్రెస్ పార్టీ మొదటినుండి బహిర్గతం చేస్తుండగా, నిష్పక్షపాతంగా జరుగుతున్న దర్యాప్తు కమిషన్ వద్ద వివరాలు వెల్లడించాలని సూచించారు. అయితే కమిషన్ ఎదుట హాజరు నుండి తప్పించుకోవడానికి కెసిఆర్, కేటీఆర్, హరీష్ రావులు పన్నుతున్న కుట్రలో భాగంగానే రైతులు, ప్రజలను రెచ్చగొడుతున్నట్లు స్పష్టం చేశారు. ఫోన్ ట్యాపింగ్ దర్యాప్తు, కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై విచారణ జరుగుతున్న నేపథ్యంలో కెసిఆర్ కుటుంబం ఒక్కొక్కరుగా అమెరికా వెళ్తుండడాన్ని రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నట్లు తెలిపారు. ఏడు దశాబ్దాల క్రితం నిర్మించిన నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్టులు చారిత్రాత్మక కట్టడాలుగా నిలుస్తుండగా, కేవలం కమిషన్ల కోసం అంచనాలు పెంచి నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం వారి అవినీతిని బట్టబయలు చేసిందని అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని గత కేసీఆర్ ప్రభుత్వ%శీ% పూర్తిగా దిగజార్చినప్పటికీ సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నట్లు వివరించారు.

## నూతన తహసీల్దార్ ను మర్యాద పూర్వకంగా కల్సిన మణుగూరు ఆదివాసీ జేఏసీ నాయకులు



తొలిఅడుగు, మణుగూరు, మే 23 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలంలో నూతనంగా బాధ్యతలు తీసుకున్న తహసీల్దార్ ను మణుగూరు ఆదివాసీ జేఏసీ నాయకులు కలిసి ఘనంగా చాలువతో సన్మానించారు. అనంతరం ప్రస్తుతం ఉన్న సమస్యలను, గతంలో ఎదురుకున్న సమస్యలను వివరించారు.ప్రస్తుతం బిటిపిస్ రైల్వే ట్రాక్ మరియు మణుగూరు సింగరేణి ఓపెన్ కాస్ట్ వల్ల భూములు కోల్పోతున్న గిరిజన రైతులకు మెరుగైన ప్యాకేజీతో పాటు ప్రతి ఇంటికి ఒక జాబ్ ఇవ్వాలని కోరడం జరిగింది. వివిధ ప్రభుత్వ పథకాలు ప్రతి గ్రామంలోని పేద గిరిజనులుకు అందేలా చూడాలని వివరించారు. మణుగూరు మండలంలో చాలా భూమి సమస్యలు ఉన్నాయని గిరిజనులకు చాలా వరకు అన్యాయం జరిగింది అని అలాంటి వారందరికీ న్యాయం చేయాలనీ అన్నారు. ప్రభుత్వం ఏ కార్యక్రమం చేపట్టిన ప్రతి గ్రామంలో పిసా గ్రామసభలు ద్వారానే ఏంపిక చేయాలనీ గ్రామసభలే ఏజెన్సీ ప్రాతంలో ఆయుధం అని వివరించారు. ఇలాంటివి ఇంకా చాలా ఉన్నాయని ఎంత మంది కొత్త అధికారులు వచ్చిన మా ఆదివాసీ చట్టాలనుగాని, మా ఆదివాసీ సమస్యలనుగాని పట్టించుకున్న నాథుడు లేడు మీరైనా వీటిని అమలు చేయాలని అన్నారు. తహసీల్దార్ స్పందించి మీకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తానని ఎప్పుడు ఏ సమస్య వచ్చిన నేరుగా నాదగ్గరకు వచ్చి మీ సమస్యలు చెప్పండి అని మీకు కావాల్సిన న్యాయం చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో మణుగూరు మండల జేఏసీ అధ్యక్షుడు సోడే రవికుమార్ దొర, ఆదివాసీ జేఏసీ ఉపాధ్యక్షులు పూనెం రమేష్, ఇర్ప రవికుమార్, గణిబోయిన ముత్తయ్య, ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి తాటి వెంకటేశ్వర్లు, ఆదివాసీ జేఏసీ కోశాధికారి జోగ సురేంద్ర ప్రసాద్, ఆదివాసీ కార్యదర్శి పూనెం నాగరాజు, కాటిబోయిన నర్సింహా రావు, తదితరులు పాల్గొన్నారు.

## ఆశ్రయం, హ్యాండ్ అఫ్ హెూప్ ఆధ్వర్యంలో కుందారంలో ఉచిత వైద్య శిబిరం

- 618 మందికి ఉచిత వైద్య పరీక్షలు
- 219 మంది కంటి పరీక్షలు
- 70 మందికి కంటి అద్దాలు పంపిణీ
- 109 మందికి దంత పరీక్షలు

తొలిఅడుగు, జనగామ, మే 23 : ఆశ్రయం - హ్యాండ్ అఫ్ హెూప్ హైదరాబాద్ వారి టీం లీడర్ జంగ జయరాజు ఆధ్వర్యంలో తెలుగు బాప్టిస్ట్ సంఘం కుందారం స్థానిక కాపరి రెవరెండ్ పి.విలియం సమన్వయంతో ఉచిత మెడికల్ క్యాంపు జనగామ జిల్లా లింగాల ఘనపురం మండలం కుందారం గ్రామంలో శుక్రవారం నిర్వహించడం జరిగింది. ఈ క్యాంపులో మొత్తం 618 మందికి డాక్టర్లు భరత్, ప్రియా హర్ష, దేవసహాయం, దంత వైద్యులు డాక్టర్ మనోజ్ఞ, కంటి వైద్య నిపుణుడు శ్రీధర్ వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వీరిలో 219 మంది కంటి పరీక్షలు చేయించుకోగా 70 మందికి కంటి అద్దాలు అందజేశారు. 109 మందికి దంత పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫార్మసిస్ట్ స్వామి, ల్యాబ్ టెక్నీషియన్ కుసుమ, ఎక్స్ - రే టెక్నీషియన్ సనా బేగం, శామ్యూల్, రాకేష్, రవి, సామ్ కంచి, పాస్టర్ కుమార్, స్థానిక సంఘ పెద్దలు ఎస్.ఇస్సాక్, పి.బిక్షపతి, ఎస్.కృష్ణ, పి.జితేందర్, సిహెచ్.వెంకటేష్, పి.ఎల్లయ్య, పి.సోమయ్య, ఏ.యాదగిరి, సిహెచ్.నర్సెల్లయ్య, బి.బిక్షపతి, సిహెచ్.చంద్రయ్య, సోమయ్య, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.




## నికర ఎఫ్‌డిఐల్లో 96 శాతం పతనం




తొలిఅడుగు విదేశీ పెట్టుబడులకు భారత్ ఆశజనకంగా కానరావడం లేదు. దేశ ఆర్థిక వ్యవస్థలో బలహీనతలు డిమాండ్‌ను సన్నగిల్లేలా చేస్తోంది. ఈ నేపథ్యంలోనే గడిచిన ఆర్థిక సంవత్సరం (2024-25)లో నికర విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు ఏకంగా 96 శాతం పతనమై 353 మిలియన్ డాలర్లకు పడిపోయాయని రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) వెల్లడించింది. విదేశీ కంపెనీల ఇక్కడి పెట్టుబడుల నుంచి భారత కంపెనీలకు చెందిన విదేశాల్లోని పెట్టుబడులను తీసేస్తే.. మిగిలేది నికర ఎఫ్‌డిఐలుగా పరిగణిస్తారు. కరోనా కాలం 2020-21లోనూ ఏకంగా 44 బిలియన్ డాలర్ల పెట్టుబడులు వచ్చాయి. తదుపరి ఏడాది 38.6 బిలియన్లు, 2022-23లో 28 బిలియన్ డాలర్లు, 2023-24లో 10.1 బిలియన్లుగా చివరగా 2024-25లో కేవలం 0.4 బిలియన్లు (353 మిలియన్లు) ఎఫ్‌డిఐలు నమోదయ్యాయి. 2024-25లో స్థూల పెట్టుబడులు 81 బిలియన్లుగా, ఇంతక్రితం ఏడాది 71.3 బిలియన్లుగా, 2022-23లో 71.4 బిలియన్లుగా చోటు చేసుకున్నాయి. అత్యధిక పెట్టుబడులు సింగపూర్, అమెరికా, యుఎఇ, మారిషాస్, నెథర్లాండ్ దేశాల నుంచి అధిక ఎఫ్‌డిఐలు వచ్చాయి. 2024-25లో భారత కంపెనీలు విదేశాల్లో 29.2 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టాయి. ఇంతక్రితం ఏడాది పెట్టుబడులతో పోల్చితే 75 శాతం పెరుగుదల నమోదయ్యింది.

## గోల్డ్ లవర్స్ ఇక కొనేసేయండి.. బంగారం ధర తగ్గిందోచ్..?

తొలిఅడుగు గోల్డ్ ధరలు భారీగా పెరుగుతూపోగా.. నిన్న అనగా బంగారం ధరలు తగ్గుముఖం పట్టాయి. మరి హైదరాబాద్‌లో ఇవాల్టి బంగారం ధరలు ఎలా ఉన్నాయంటే.. ఆ ధరలు ఇప్పుడు ఈ స్టోరీలో ఇప్పుడు తెలుసుకుందామా. గోల్డ్ లవర్స్ ఇది వినండి.. గత కొద్దిరోజులుగా బంగారం ధరలు దోబూచులాడుతున్నాయ్. కొద్దిరోజులు బంగారం ధరలు భారీగా పెరుగుతూపోతుంటే.. మరికొద్ది రోజులు తగ్గుముఖం పడుతున్నాయి. వరుసగా రెండు రోజులు రూ. 2650 మేరకు స్వచ్ఛమైన బంగారం ధర.. నిన్న(గురువారం) స్వల్పంగా తగ్గుముఖం పట్టింది. 24 క్యారెట్ల బంగారం ధర రూ. 350 మేరకు తగ్గితే.. 22 క్యారెట్ల గోల్డ్ రేట్ రూ. 380 మేరకు తగ్గింది. అటు వెండి ధరలు కూడా బంగారం బాటలోనే పయణిస్తున్నాయి. సిల్వర్ రేట్లు భారీగా తగ్గాయి. చెన్నైలో 24 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రేటు రూ. 97,530గా ఉండగా.. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 89,400గా ఉంది. బెంగళూరులో 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 89,400గా ఉండగా.. 24 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రేటు రూ. 97,530గా ఉంది. అటు హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం నగరాల్లో 24 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రేటు రూ. 97,530గా ఉండగా.. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 89,400గా ఉంది. బంగారం బాటలోనే వెండి ధరలు భారీగా తగ్గాయి. గత రెండు రోజులుగా సుమారు రూ. 4 వేల మేరకు పెరిగిన వెండి ధర.. నిన్న(గురువారం) రూ. 1000 మేరకు తగ్గింది. ముంబై, ఢిల్లీ, కోల్‌కతా నగరాల్లో కేజీ వెండి ధర రూ. లక్ష ఉండగా.. చెన్నై, హైదరబాద్, కేరళ, విజయవాడ, విశాఖపట్నంలో కిలో వెండి రూ. 1,11,000గా ఉంది.




## బజాజ్ చేతికి కేటీఎం మెజారిటీ వాటాల కొనుగోలుకు ప్రయత్నాలు




తొలిఅడుగు రుణాల ఊబిలో కూరుకుపోయి కష్టాలు పడుతున్న ఆస్ట్రియాకు చెందిన బైక్‌ల తయారీ కంపెనీ కేటీఎంలో మెజారిటీ వాటాలు కొనుగోలు చేయాలనుకుంటున్నట్టు బజాజ్ ఆటో ప్రకటించింది. తమ పూర్తి యాజమాన్య సంస్థ బజాజ్ ఆటో ఇంటర్నేషనల్ హెూల్డింగ్స్ బీవీ ద్వారా ఈ కొనుగోలు చేయాలనుకుంటున్నట్టు వెల్లడించింది. ఇందుకోసం ఇప్పటికే 80 కోట్ల యూరోల (రూ.7,765 కోట్లు) రుణ ప్యాకేజి సమకూర్చినట్టు తెలిపింది. అన్ని రకాల అనుమతులు సాధించినట్టయితే కేటీఎంలో ప్రస్తుతం మైనారిటీ వాటాలున్న బజాజ్ మెజారిటీ వాటాలతో ఆ కంపెనీ యజమానిగా మారుతుందని ఆ ప్రకటనలో పేర్కొంది. ఉమ్మడి అభివృద్ధి కార్యక్రమం కింద భారత్ కేంద్రంగా నిర్వహిస్తున్న కేటీఎం వ్యాపారాల్లో వేగం పెంచే కృషిని కొనసాగిస్తామని బజాజ్ తెలిపింది. ఈ కార్యక్రమం కింద ఉభయ సంస్థలు ఉమ్మడిగా బైక్‌ల అభివృద్ధి, తయారీ, విక్రయ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. 80 దేశాలకు ఎగుమతి చేస్తున్నాయి. కేటీఎం రుణ పునర్నిర్మాణానికి, వ్యాపారాల కొనసాగింపునకు తాము సమకూర్చిన నిధులు ఉపయోగపడతాయని కంపెనీ ఆ ప్రకటనలో తెలిపింది. ఆ 80 కోట్ల యూరోల్లో 20 కోట్ల యూరోలు ఇప్పటికే అందించామని, మిగతా సొమ్మును త్వరలో సమకూరుస్తామని కూడా పేర్కొంది. అత్యం త కీలక దశలో నిధులు సమకూర్చడంతో పాటు యాజమాన్య బాధ్యతలు కూడా చేపట్టడం ద్వారా కేటీఎం భవిష్యత్తును నిర్దేశించగల శక్తిగా బజాజ్ నిలుస్తుందని కంపెనీ తెలిపింది.





# ఆర్‌సీబీ ఫ్యాన్స్‌కు గుడ్‌న్యూస్..



తొలిఅడుగు ఐపీఎల్ ప్లే-ఆఫ్‌లకు అందుబాటులో లేకపోవడంతో ఇంగ్లాండ్ బ్యాట్స్‌మన్ జాకబ్ బెథెల్ స్థానంలో న్యూజిలాండ్ ఆటగాడు టిమ్ సీఫెర్ట్‌ను రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు గురువారం జట్టులోకి తీసుకుంది. అదనంగా, జట్టు కెప్టెన్ రజత్ పూర్తిగా ఫిట్‌గా ఉన్నారని కోచ్ అధికారికంగా ప్రకటించాడు. ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2025 ఇప్పుడు ప్లేఆఫ్ దశ వైపు కదులుతోంది. లీగ్‌లో ఇంకా 7 మ్యాచ్‌లు మిగిలి ఉన్నాయి. కానీ నాలుగు ప్లేఆఫ్ జట్లు ఇప్పటికే ప్లేఆఫ్‌కు అర్హత సాధించాయి. ఈ సంవత్సరం రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, గుజరాత్ టైటాన్స్, పంజాబ్ కింగ్స్, ముంబై ఇండియన్స్ టాప్ 4 జట్లు. కానీ, ప్లేఆఫ్‌లు దగ్గర పడుతున్న తరుణంలో, బెంగళూరుకు రెండు శుభవార్తలు అందాయి. ఐపీఎల్ ప్లేఆఫ్‌లకు అందుబాటులో లేని ఇంగ్లాండ్ బ్యాట్స్‌మన్ జాకబ్ బెథెల్ స్థానంలో న్యూజిలాండ్‌కు చెందిన టిమ్ సీఫెర్ట్‌ను రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు గురువారం ఎంపిక చేసింది. అంతేకాకుండా, జట్టు కెప్టెన్ రజత్ పటాధర్ పూర్తిగా ఫిట్‌గా ఉన్నాడని, సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగే ఈరోజు మ్యాచ్‌లో రజత్ కూడా మైదానంలో ఉండటం ఖాయం అని కోచ్ అధికారికంగా ప్రకటించాడు. రజత్ పాటిదార్ నాయకత్వంలో, ఆర్‌సీబీ ఇప్పటివరకు అద్భుతంగా రాణించింది. ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించింది. అయితే, చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో రజత్ వేలికి గాయమైంది. ఆ తరువాత, అతను పోటీలో పాల్గొనడంపై సందేహాలు ఉన్నాయి. కానీ, ఇప్పుడు జట్టు కోచ్ ఆండీ ఫ్లవర్ మాట్లాడుతూ రజత్ పూర్తిగా ఫిట్‌గా ఉన్నాడని చెప్పకొచ్చాడు. "ఐపీఎల్ విరామం గురించి మేం ఆందోళన చెందడం లేదు. జట్టు సీజన్ అంతటా కష్టపడి పనిచేసింది. ఇప్పటివరకు అద్భుతంగా ప్రదర్శన ఇచ్చింది. ఈ విరామం కొంతమంది ఆటగాళ్లకు ఫిట్‌గా ఉండటానికి అవకాశం ఇచ్చింది. మే 17న జరగాల్సిన ఆర్‌సిబి, కోల్‌కతా నైట్ రైడర్స్ మధ్య జరిగిన మ్యాచ్ వర్షం కారణంగా రద్దు చేశారు. ఇది విరామాన్ని మరింత పొడిగించింది. ఇప్పుడు రజత్ పాటిదార్ బ్యాటింగ్‌కు ఫిట్‌గా ఉన్నాడు. ఇది మంచిది. ఓపెనర్ ఫిల్ సాల్ట్ కూడా అనారోగ్యంతో ఉన్నాడు. కానీ, బ్రేక్ సమయంలో ఫిట్‌గా ఉండటానికి అవకాశం వచ్చింది. ఇప్పుడు వారు పూర్తిగా ఫ్రెష్‌గా ఉన్నారు. ఆడటానికి సిద్ధంగా ఉన్నారు" అని అతను చెప్పుకొచ్చాడు. ఆర్‌సీబీ ఇప్పుడు మిగిలిన అన్ని మ్యాచ్‌లను వారి సొంత మైదానానికి దూరంగా ఆడాలి. ఈ సవాలుకు జట్టు సిద్ధంగా ఉందని కోచ్ చెప్పుకొచ్చాడు. బెంగళూరులో వర్షం కారణంగా, సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో మ్యాచ్ లక్నోలో జరుగుతోంది. బెంగళూరులో మ్యాచ్ ఆడకపోవడం మాకు నిరాశ కలిగించిందని ఆయన అన్నారు. "ఇతర మైదానాల్లో మా రికార్డు అద్భుతంగా ఉంది. హైదరాబాద్‌పై జట్టు బాగా ఆడుతుందని మేం ఆశిస్తున్నాం" అని తెలిపాడు.

## దుమారం రేపుతోన్న పంత్, గిల్ షేక్ హ్యాండ్ వ్యవహారం..



తొలిఅడుగు పంత్‌ను విస్మరించడంపై చాలా మంది వినియోగదారులు తీవ్రంగా కామెంట్లు చేస్తున్నారు. మరికొందరు ఇది ఇద్దరు భారత సహచరుల మధ్య స్నేహపూర్వక పరిహాసమని సూచించారు. దీనిపై సోషల్ మీడియాలో తీవ్రమైన చర్చలు జరుగుతున్నాయి. సోషల్ మీడియాలో కొన్నిసార్లు చిన్న విషయాలు కూడా పెద్ద చర్చకు దారితీస్తాయి. భారత యువ క్రికెటర్, గుజరాత్ టైటాన్స్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ విషయంలోనూ ఇలాంటిదే జరిగింది. గుజరాత్, లక్నో మ్యాచ్ అనంతరం లక్నో సూపర్ జెయింట్స్ కెప్టెన్ రిషభ్ పంత్‌తో గిల్ కరచాలనం చేసిన తీరు పలువురు అభిమానులకు నచ్చలేదు. పంత్‌ను గిల్ ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం చేశాడని, ఇది అహంకారపూరిత చర్య అని కొందరు సోషల్ మీడియా వేదికగా విమర్శలు గుప్పించారు. ఈ సంఘటనతో ఇంటర్నెట్‌లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. గురువారం అహ్మదాబాద్‌లో గుజరాత్ టైటాన్స్‌పై 33 పరుగుల తేడాతో విజయం సాధించి, వరుసగా 4 నాలుగు మ్యాచ్‌ల ఓటములకు తెరదించింది లక్నో సూపర్ జెయింట్స్. లక్నో విజయానికి హీరోగా సెంచరీ హీరో మాచెల్ మార్ష్ నిలిచాడు. ఈ మ్యాచ్ మార్ష్, లక్నోకు బాగా కలిసొచ్చినప్పటికీ, మ్యాచ్ తర్వాత శుభ్‌మాన్ గిల్, రిషబ్ పంత్ మధ్య జరిగిన కొద్దిపాటి వాగ్వాదం సోషల్ మీడియాలో అందరి దృష్టిని ఆకర్షించింది. కొన్ని సెకన్ల పాటు కొనసాగిన జరిగిన ఈ సీన్‌లో.. గిల్ ఆచారం ప్రకారం కరచాలనం చేస్తున్న సమయంలో పంత్‌ను దాటి నడిచినట్లు కనిపించాడు. లక్నో సూపర్ జెయింట్స్ కెప్టెన్ కొన్ని మాటలు మాట్లాడటానికి ఆసక్తిగా ఉన్నట్లు కనిపించాడు. గిల్ వేగంగా తదుపరి ఆటగాడి వైపు కదిలాడు. పంత్ తన వైపు తిరిగి చూడమని ప్రేరేపించాడని వీడియోలో తెలుస్తోంది. ఈ క్రమంలో పంత్‌ను విస్మరించడంపై చాలా మంది వినియోగదారులు తీవ్రంగా కామెంట్లు చేస్తున్నారు. మరికొందరు ఇది ఇద్దరు భారత సహచరుల మధ్య స్నేహపూర్వక పరిహాసమని సూచించారు. దీనిపై సోషల్ మీడియాలో తీవ్రమైన చర్చలు జరుగుతున్నాయి. మ్యాచ్ విషయానికొస్తే, నిన్న మార్ష్ షోగా మిగిలిపోయింది. రషీద్ ఖాన్ బౌలింగ్‌లో ఒకే ఓవర్‌లో రెండు సిక్సర్లు, మూడు బౌండరీలతో 64 బంతుల్లో 117 పరుగులు చేసిన మార్ష్ లక్నోను 235/2కి చేర్చాడు. నికోలస్ పూరన్ 27 బంతుల్లో అజేయంగా 56 పరుగులు చేసి అండగా నిలిచాడు. సమాధానంగా, గుజరాత్ జట్టు ఛేదనలో చతికిలపడింది. అవేష్ ఖాన్ 4-6-6-4 గుజరాత్‌ను భయపెట్టాడు. ఈ క్రమంలో విల్ ఓ'రూర్కే (3/27) సాయి సుదర్శన్, షెర్ఫేన్ రూథర్‌ఫోర్డ్, రాహుల్ తెవాటియా వికెట్లను పడగొట్టాడు. షారుఖ్ ఖాన్ 29 బంతుల్లో 57 పరుగులు చేయడం వృథాగా మారిపోయింది. ఈ క్రమంలో గుజరాత్ టార్గెట్ చేరుకోలేక 202/9కే పరిమితం అయింది. ఈ ఓటమితో, గుజరాత్ టాప్-2లో స్థానం సంపాదించే అవకాశాన్ని కోల్పోయింది. కానీ చెన్నైపై విజయంతో ఇంకా ఆ స్థానాన్ని సంపాదించుకోవచ్చు. ఇప్పటికే ప్లేఆఫ్ పోటీ నుంచి నిష్క్రమించిన లక్నో, సీజన్ చివరి మ్యాచ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో తలపడటంతో, సీజన్‌ను గొప్ప విజయంతో ముగించాలని చూస్తుంది. గుజరాత్‌తో పాటు, ముంబై ఇండియన్స్, పంజాబ్ కింగ్స్, బెంగళూరు తమ ప్లేఆఫ్ స్థానాలను ఖరారు చేసుకున్నాయి. దీంతో ప్లేఆఫ్ మ్యాచ్‌లు మరింత ఉత్కంఠగా మారనున్నాయి.

## లక్నో చేతిలో గుజరాత్ ఓటమి..



తొలిఅడుగు గురువారం, నరేంద్ర మోడీ స్టేడియంలో గుజరాత్ టైటాన్స్‌తో లక్నో సూపర్ జెయింట్స్ తలపడింది. రిషబ్ పంత్ నేతృత్వంలోని జట్టు గుజరాత్‌ని 33 పరుగుల తేడాతో ఓడించింది. అయితే, గుజరాత్ ఇప్పటికే ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించినందున ఈ మ్యాచ్ లక్నోకు కాస్త ఊరటనిచ్చేదిగా మారింది. కానీ ఓటమి శుభ్‌మాన్ గిల్ నేతృత్వంలోని జట్టును దెబ్బతీస్తుంది. ఎందుకంటే, పాయింట్ల పట్టికలో టాప్ 2లో కొనసాగే అవకాశాలను దెబ్బతీస్తుంది. ప్రస్తుతం గుజరాత్ టైటాన్స్ 13 మ్యాచ్‌ల్లో 18 పాయింట్లతో పట్టికలో అగ్రస్థానంలో ఉంది. చెన్నై సూపర్ కింగ్స్‌తో చివరి మ్యాచ్ మిగిలే ఉంది. అయితే, ఓటమి ఇతర జట్లకు, ముఖ్యంగా ముంబై ఇండియన్స్‌కు సానుకూల సంకేతంలా మారింది. టాప్ 2లో నిలిచే రేసులో గుజరాత్ 18 పాయింట్లతో అగ్రస్థానంలో ఉండగా, ఆర్‌సీబీ 12 మ్యాచ్‌ల్లో 17 పాయింట్లతో 2వ స్థానంలో ఉంది. అదే సమయంలో, పంజాబ్ 12 మ్యాచ్‌ల్లో 17 పాయింట్లతో 3వ స్థానంలో, ముంబై 13 మ్యాచ్‌ల్లో 16 పాయింట్లతో చివరి స్థానంలో ఉన్నాయి. ముఖ్యంగా, గుజరాత్ ఓటమితో, ముంబై ఇండియన్స్ పట్టికలో అగ్రస్థానంలో నిలిచే అవకాశం తెరుచుకుంటుంది. ముంబైకి ఒక మ్యాచ్ మాత్రమే మిగిలి ఉంది. గరిష్టంగా, ముంబై 18 పాయింట్లతో ముగించవచ్చు. ముంబై జట్టు పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో ఉండాలంటే, పంజాబ్ కింగ్స్‌తో జరిగే చివరి గ్రూప్ దశ మ్యాచ్‌లో గెలిచి 18 పాయింట్లను సాధించాల్సి ఉంటుంది. ఇంకా, హార్దిక్ పాండ్యా నేతృత్వంలోని జట్టు బెంగళూరు జట్టు తమ మిగిలిన రెండు మ్యాచ్‌లను ఓడిస్తే, చెన్నై తమ చివరి మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్‌ను ఓడిస్తే.. అప్పుడు అగ్రస్థానంలో నిలుస్తుంది.

## అదరగొడుతున్న ముంబయి ఇండియన్స్



తొలిఅడుగు ఐపిఎల్ సీజన్ 2025 లో ముంబై ఇండియన్స్ అసాధారణ ఆటతో ప్లేఆఫ్ బె ర్త్‌ను సొంతం చేసుకుంది. తొలి నాలుగు మ్యాచుల్లో మూడింటిలో పరాజయం పాలైన ముంబై ఆ తర్వాత అనూహ్యంగా పుంజుకుంది. అందరి అంచనాలు తారుమారు చేస్తూ ఏకంగా ప్లేఆఫ్‌కు దూసుకెళ్లింది. ఆరంభ మ్యాచుల్లో ముంబై ఆటను చూసిన వారికి హా ర్దిక్ సేన ముందుకు వెళ్లడం కష్టమేనని అనిపించింది. వరుస ఓటములతో జట్టు డీలా పడిపోయింది. ఇ లాంటి స్థితిలో జట్టు పని అయిపోయిందని విశ్లేషకు లు సయితం అంచనాకు వచ్చారు. అయితే ముంబై మాత్రం ఎలాంటి ఒత్తిడికి గురి కాకుండా ఒక్కో మ్యాచ్‌లో గెలుస్తూ మళ్లీ గాడిలో పడింది. హార్దిక్ పాం డ్య అద్భుత కెప్టెన్సీకి అనుభవజ్ఞులు రోహిత్ శర్మ, బుమ్రా, సూర్యకుమార్ యాదవ్ సలహాలు, సూచనలు తోడు కావడంతో ముంబై మళ్లీ పూర్వం సంతరించుకుంది. వరుస విజయాలతో ప్రత్యర్థి జట్లను హ డలెత్తింది. వరుసగా ఐదు మ్యాచుల్లో గెలిచి పెను ప్ర కంపనలు సృష్టించింది. ముంబైని ఓడించేందుకు ఇత ర జట్లు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. రోహిత్ శ ర్మ, రికెల్టన్‌లు దాదాపు ప్రతి మ్యాచ్‌లోనూ జట్టుకు శుభారంభం అందించారు. రోహిత్ ఫామ్‌లోకి రావ డం ముంబైకి కలిసి వచ్చిన అంశంగా మారింది. రో హిత్, సూర్యకుమార్ యాదవ్‌లు అద్భుత బ్యాటింగ్ తో జట్టుకు అండగా నిలిచారు. ఇద్దరు కీలక ఇన్నింగ్స్‌లు ఆడుతూ జట్టు విజయంలో ముఖ్య భూమిక పోషించారు. రికెల్టన్ కూడా రోహిత్‌కు మంచి సహకారం అందించాడు. ఈ ముగ్గురు నిలకడగా ఆడడం తో ముంబై బ్యాటింగ్ పటిష్టంగా మారింది. వీరికి తో డు నమన్‌ధిర్, తిలక్‌వర్మ, కెప్టెన్ హార్దిక్ పాండ్య, విల్‌జాక్స్ తదితరులు కూడా తమతమ బ్యాట్‌లను ఝులిపిస్తూ జట్టును ఆదుకున్నారు.

## ఆత్మవిశ్వాసంతో హైదరాబాద్..

తొలిఅడుగు ఇప్పటికే ప్లేఆఫ్ రేసు నుంచి నిష్క్రమించిన సన్‌రైజర్స్ హైదరాబాద్ మిగిలిన రెండు మ్యాచుల్లోనూ గెలిచి పాయింట్ల పట్టికలో మెరుగైన స్థానంలో నిలవాలని భావిస్తోంది. లక్నో సూపర్ జెయింట్స్‌తో జరిగిన కిందటి మ్యాచ్‌లో విజయం సాధించడం హైదరాబాద్‌కు కలిసి వచ్చే అంశంగా చెప్పాలి. బెంగళూరుతో జరిగే మ్యాచ్‌లో ఆత్మవిశ్వాసంతో దిగేందుకు ఈ గెలుపు దోహదం చేస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. బెంగళూరు ఇప్పటికే నాకౌట్ బెర్త్‌ను సొంతం చేసుకుంది. హైదరాబాద్‌పై కూడా గెలిచి పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి చేరుకోవాలని భావిస్తోంది. రెండు జట్లలోనూ ప్రతిభావంతులైన ఆటగాళ్లు ఉండడంతో పోరు ఆసక్తికరంగా సాగడం ఖాయం. లక్నోతో జరిగిన మ్యాచ్‌లో విధ్వంసక ఇన్నింగ్స్‌తో చెలరేగిన యువ ఓపెనర్ అభిషేక్ శర్మపై అందరి కళ్లు నిలిచాయి. ఈ మ్యాచ్‌లో కూడా చెలరేగేందుకు సిద్ధమయ్యాడు. ఒంటిచేత్తో మ్యాచ్ ఫలితాన్ని తారుమారు చేసే సత్తా కలిగిన అభిషేక్ చెలరేగితే సన్‌రైజర్స్‌కు ఎదురే ఉండదు. కిందటి మ్యాచ్‌లో ఇషాన్ కిషన్ కూడా మెరుగైన బ్యాటింగ్‌ను కనబరిచాడు. ఇది కూడా జట్టుకు కలిసి వచ్చే అంశంగా చెప్పాలి. ఇషాన్, అభిషేక్‌లు చెలరేగితే హైదరాబాద్‌కు భారీ స్కోరు ఖాయం. హెన్రిచ్ క్లాసెన్, అనికేత్ వర్మ, నితీశ్ కుమార్ రెడ్డి, కెప్టెన్ కమిన్స్ తదితరులతో హైదరాబాద్ బ్యాటింగ్ బలంగా ఉంది. లక్నో మ్యాచ్‌లో రిటైర్‌హర్ట్‌గా వెనుదిరిగిన ఆల్‌రౌండర్ కమింది మెండిస్ ఈ మ్యాచ్‌లో ఆడతాడా లేదా అనేది చెప్పలేం. బౌలింగ్ కూడా హైదరాబాద్ బాగానే ఉంది. కిందటి మ్యాచ్‌లో ఇషాన్ మలింగ మెరుగైన బౌలింగ్‌తో ఆకట్టుకున్నాడు. ఈసారి కూడా సత్తా చాటేందుకు సిద్ధమయ్యాడు. మరోవైపు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఈ మ్యాచ్‌కు సమరోత్సాహంతో సిద్ధమైంది. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో జట్టు సమతూకంగా ఉంది. ఒంటిచేత్తో మ్యాచ్ ఫలితాన్ని తారుమారు చేసే బ్యాటర్లు, బౌలర్లకు జట్టులో కొదవలేదు. విరాట్ కోహ్లి, రజత్ పటిదార్, జితేశ్ శర్మ, ఫిల్ సాల్ట్, టిమ్ డేవిడ్ తదితరులతో జట్టు బలంగా ఉంది. ఈ మ్యాచ్‌లో కూడా గెలిచి రానున్న ప్లేఆఫ్ మ్యాచ్‌లకు ఆత్మవిశ్వాసంతో సిద్ధం కావాలని బెంగళూరు భావిస్తోంది.